

# జై భీమ్

తెలుగు దినపత్రిక

POWER OF PEOPLE

సమస్యలపై సమరంగా


Jai Bheem TV STRUGGLE FOR JUSTICE

సామాన్యుడి ఆయుధంగా




సంపుటి - 06 | సంచిక 364 | ఎడిటర్ : బరిగెల శివ | ఆదివారం 30, నవంబర్ 2025 | పేజీలు 8 | వెల రూ. 5

పబ్లిషర్స్ తెలంగాణ : హైదరాబాద్, ఆంధ్రప్రదేశ్ : విజయవాడ, ఢిల్లీ, కర్ణాటక, బెంగళూరు, తమిళనాడు, చెన్నై, మహారాష్ట్ర, ముంబై, గోవా, కేరళ, ఉత్తరప్రదేశ్, పజాబ్, పశ్చిమబెంగాల్, అమెరికా, లండన్, ఆస్ట్రేలియా, దుబాయ్, మస్కట్


# హైడ్రాను వ్యతిరేకించడం.. అవివేకం !






హైడ్రా ప్రభంజనానికి అడ్డుపడుతున్నారు

వ్యదలు తీరవు వ్యవస్థలు మారవు.

హైడ్రాను వ్యతిరేకిస్తున్న వ్యవస్థలు మారాలి

అత్యధిక స్థాయిలో ప్రజాదారణ పొందుతున్న హైడ్రా

సాధారణ ప్రజల వ్యదలు తీర్చాల్సింది ప్రభుత్వాలు

చట్టాలు న్యాయస్థానాలు హైడ్రాకు అండగా నిలవాలి

ఎన్నారైలు ఎక్కడ భూములు కొనాలో ఆమాత్రం తెలుసుకోరా!

ప్రభుత్వ భూములు కాపాడాలంటే గట్స్ ఉండాలి

దళారి భూకబ్జాదారులకు లొంగుతున్న భూ కొనుగోలుదారులు

దినదినం హైడ్రాకు పెరుగుతున్న ప్రజాదారను చూసి తట్టుకోలేకపోతున్నారు

చెరువులు రక్షించబడి పునరుద్ధరించబడితేనే హైదరాబాదుకు రక్షణ : డాక్టర్ బరిగెల శివ

హైదరాబాద్ (జై భీమ్ డెస్క్)

భూకబ్జాలకు నిలయంగా మారుతున్న తెలంగాణ రాష్ట్రాన్ని కాపాడుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందని డాక్టర్ బరిగెల శివ విశ్వాసంగా తెలిపారు.సగౌరవంతో పనిచేసే వ్యక్తులు చాలా అరుదుగా ఉంటారని అలాంటి వాళ్ళలో హైడ్రా కమిషనర్ ఏవి రంగనాథ్ ఐపీఎస్ ముందు వరుసలో ఉండే ఒకరని అభినందించారు. ప్రశంసల కోసమో,మెప్పుల కోసమో,వ్యక్తిగత స్వార్థం కోసం ఆశించిన వారైతే ఇంతలా కష్టపడి మొండితనంతో హైదరాబాద్ ప్రాంతాన్ని రక్షించాలనే బాధ్యతను తన భుజస్కందాలపై వేసుకునేవారు కారన్నారు.అందరూ ఉన్నత అధికారులు లాగే తను కూడా ఉద్యోగ ధర్మాన్ని సాదాసీదా పాటించినట్లయితే, హైడ్రాకు ఇంతటి ప్రభంజనం ఎలా వస్తుందని గుర్తు చేశారు.హైడ్రాను ప్రశంసించే వారితోపాటు విమర్శించే వారు కూడా ఉంటారని ప్రశంశాలను విమర్శలను సమపాలుగా స్వీకరిస్తూ చెరువుల రక్షణను, నాళల రక్షణను, ప్రభుత్వ భూముల పరిరక్షణను చెరువుల పునరుద్ధారణను చేపడుతూ మొండితనం లాంటి తెగింపుతో మొక్కవోని ఆత్మవిశ్వాసంతో హైడ్రా కమిషనర్ పని చేస్తున్నారని గుర్తు చేశారు.సమాజంలో మంచి కన్నా చెడు ఎక్కువగా ప్రభళించబడుతుందని చెడును గుర్తించినంత సులభంగా మంచిని గుర్తించడంలో ఆలస్యం జరుగుతుందని కేవలం ప్రస్తుత కాలం గురించి ఆలోచించాల్సి వస్తే హైడ్రా లాంటి సంస్థలు ఏర్పడి పెద్దగా ప్రయోజనం ఉండకపోవచ్చునని గుర్తు చేస్తూ భావితరాలకు భవిష్యత్ తరాలకు పురాతన కాలం లాంటి పరిస్థితులను చక్కబెడుతూ ప్రస్తుత

- మిగతా 2లో..

## సర్పంచ్ ఎన్నికల బరిలో నిలిచిన మాజీ మావోయిస్టు నేత జ్యోతి

రాజన్న సిరిసిల్ల జిల్లా శివంగలపల్లి నుంచి పోటీ

19 ఏళ్ల పాటు మావోయిస్టు పార్టీలో పనిచేసిన నేపథ్యం ప్రజాసేవ కోసమే ఎన్నికల్లో నిలబడ్డానని వెల్లడి



2



## ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని కలిసిన శుభలేఖ సుధాకర్

ఎస్పీ బాలసుబ్రహ్మణ్యం విగ్రహావిష్కరణ కార్యక్రమానికి ఆహ్వానం

రవీంద్ర భారతి ఆవరణలో విగ్రహావిష్కరణ

విగ్రహ ఏర్పాటుకు అనుమతించినందుకు కృతజ్ఞతలు తెలిపిన సుధాకర్

2

## కర్ల రాజేశ్ మరణంపై చర్యలు తీసుకోవాలని డిమాండ్

సూర్యాపేట ఎస్పీని కలిసిన ఎమ్మార్పీఎస్ అధినేత పద్మశ్రీ మందకృష్ణ మాదిగ



2

## కేబీఆర్ పార్క్ వద్ద స్మార్ట్ పార్కింగ్.. నేటి నుంచే ప్రారంభం

కేబీఆర్ పార్క్ వద్ద పార్కింగ్ కష్టాలకు చెక్.. ఇక ట్రాఫిక్ జామ్‌కు చెక్

72 కార్లు, ద్విచక్రవాహనాలు పార్క్ చేసేందుకు సౌకర్యం

మొబైల్ యాప్‌తో ముందుగానే స్లాట్ బుకింగ్ చేసుకునే వీలు

2



## హైదరాబాద్ నుంచి వరంగల్‌కు వందే భారత్ రైల్లో ప్రయాణించిన కేంద్రమంత్రి

వరంగల్ రైల్వే స్టేషన్‌లో చాయ్ పే చర్చ కార్యక్రమం నిర్వహించిన కిషన్ రెడ్డి

భద్రకాళి అమ్మవారిని దర్శించుకున్న కిషన్ రెడ్డి

వరంగల్ విమానాశ్రయ పనులు వేగవంతం చేయాలని నిర్ణయించినట్లు వెల్లడి

2



ముగిసిన మొదటి విడత నామినేషన్లు

శనివారం సాయంత్రంతో ముగిసిన మొదటి విడత నామినేషన్ల గడువు

మొదటి విడతలో 4,236 గ్రామ పంచాయతీలు, 37,440 వార్డుల్లో నామినేషన్ల స్వీకరణ

వచ్చే నెల 11న పోలింగ్, ఓట్ల లెక్కింపు

## తెలంగాణలో పంచాయతీ ఎన్నికలు..

2



జై భీమ్ తెలుగు దినపత్రిక POWER OF PEOPLE
సమస్యలపై సమరంగా Jai Bheem TV STRUGGLE FOR JUSTICE సామాన్యుడి ఆయుధంగా

# హైడ్రాను వ్యతిరేకించడం అవివేకం

మొదటి పేజీ తరువాయి

కాలాలను సరిచేస్తూ భవిష్యత్తు నిర్మాణం కోసం ఏకీకృత ప్రణాళికలతో హైదరాబాదును కాపాడాల్సిన బాధ్యతను చేపట్టడం కేవలం ఒక హైడ్రా తోనే సాధ్యమవుతుందన్నారు. ఎన్నారైలు బయటి దేశాలలో డబ్బులు సంపాదించుకొని వాటిని ఏం చేయాలో తెలియక దళారీ వ్యక్తులను నమ్మి హైదరాబాదులో చెరువులలో గల భూములను నాళలలో గల భూములను కొనుగోలు చేసుకుని వాటికి మున్సిపల్ అనుమతులు కరెంటు మీటర్ల అనుమతులు ఇంటి పనుల బిల్లులు సిద్ధపరచుకొని మౌఖిక హక్కులు సంపాదించుకోవడం కోసం తాత్కాలిక భూ రక్షణ ఉపశమనాన్ని పొందుతున్నారన్నారు. వాస్తవానికి చెరువులలో గాని నాళ భూములలో గాని అక్రమ నిర్మాణాలకు మునిసిపల్ శాఖలు రెవెన్యూ శాఖలు ఇరిగేషన్ శాఖలు ఎలక్ట్రిసిటీ శాఖలు ఎలాంటి అనుమతులు మంజూరు చేయకుండా ఉండాల్సి ఉండగా గత 15 సంవత్సరాలుగా ప్రభుత్వ యంత్రాంగాల తీరువల్ల ప్రభుత్వ స్థలాల్లో ఎక్కడలేని అక్రమ కబ్జానిర్మానాలు కట్టబడ్డాయన్నారు. ప్రస్తుతం హైదరాబాద్ పరిసర ప్రాంతాల్లో అక్రమ నిర్మాణాలకు కూల్చివేత పకడ్బందీగా జరుగుతుండగా ప్రభుత్వ చేరువు శిఖాలలో ప్రభుత్వ భూములలో తప్పుడు పత్రాలు సృష్టించుకొని అక్రమ నిర్మాణాలు కట్టుకున్న వ్యక్తులు ఉన్నపాటుగా న్యాయస్థానాలను ఆశ్రయిస్తూ ప్రభుత్వంపై హైడ్రా ఎక్కడలేని కేసులు వేస్తున్నారని వాటిని తెలంగాణ ప్రజలు క్షేత్రస్థాయిలో పసిగట్టాలన్నారు. రెవెన్యూ, ఇరిగేషన్ శాఖలు చెరువులను కాపాడే బాధ్యతను తీసుకుంటే హైడ్రా అవసరం ఎందుకు ఏర్పడేదన్నారు. మున్సిపల్ శాఖలు అనుమతులు మంజూరు చేయకుండా ఉంటే అక్రమ నిర్మాణాలు ఎందుకు కట్టబడే వన్నారు. హైడ్రాకు వ్యతిరేకంగా న్యాయస్థానాలను ఆశ్రయిస్తున్నది సామాన్యులా....భూ కబ్జాదారులా! తేల్చుకోవాలంటూ సవాల్ విసిరారు. మున్సిపల్ శాఖలపై రెవెన్యూ శాఖలపై ఇరిగేషన్ శాఖలపై ఎందుకు కోర్టులకు వెళ్లడం లేదంటూ నిలదీశారు. ప్రతి చెరువుకు ప్రతి నాల భూములకు 1936 సర్వే నెంబర్ల ప్రక్షాళన మొదలుకొని 1954 గ్రామ నక్షలు ఆధారంగా సేత్వార్ల ఆధారంగా విస్తీర్ణాలు లిఖించబడ్డాయని 1954 నుండి లింకు పత్రాలతో పాటు సర్వే నివేదికల ఆధారంగా ఈసీలను పరిశీలిస్తూ భూములు కొనుగోలు చేసుకోవాల్సి ఉంటుందని అలా కాకుండా దళారులను నమ్మి భూములు కొనుగోలు చేసి హైడ్రాను తప్పుదోవ పట్టించాలనుకుంటే అది ఎవ్వరి తరం కాదన్నారు. ప్రభుత్వ భూములు కొనుగోలు చేసుకునే ముందు కనీసం లింకు పత్రాలతో పాటు సర్వే నివేదికలు సిద్ధపరచుకున్నాకే కొనుక్కోవాలని సూచించారు. దినదినం హైడ్రాకు పెరుగుతున్న ప్రజాదారణను చూసి ప్రభుత్వానికి కీర్తి ప్రతిష్టలు రావడం కొంతమంది అదృశ్య శక్తులకు నచ్చక క్షేత్రస్థాయిలో హైడ్రాపై విరుచుకుపడుతూ విమర్శలు గుప్పిస్తున్నారని గుర్తు చేశారు. హైడ్రా నిర్మాణం చేపట్టిన మొదటి రోజుల్లో కూల్చివేయబడిన నిరుపేద కుటుంబాలకు ప్రభుత్వం ఖచ్చితంగా సహాయపడాలని కోరారు. అన్ని తెలిసినోళ్లే కబ్జాలకెగబడుతూ న్యాయస్థానాలను ఆశ్రయిస్తున్నారని గుర్తు చేశారు. ప్రభుత్వ భూములలో కట్టబడిన అక్రమ నిర్మాణాలకు ముందస్తుగా మునిసిపల్ అనుమతులను తొలగించడంతోపాటు రద్దుపరిచేలా చర్యలు చేపడితే హైడ్రా పనితనం మరింత వేగం పెరుగుతూ హైడ్రా చేస్తున్న పని సులభతరం అవుతుందన్నారు. దానితోపాటు మున్సిపల్ శాఖ రెవెన్యూ శాఖ ఇరిగేషన్ శాఖలు హైడ్రాలో భాగస్తులు అవుతున్నందున హైడ్రా కూల్చివేస్తున్న ప్రతి చోట ఆయా శాఖలు ప్రభుత్వ భూములుగా గుర్తించి ప్రాథమిక నివేదికల సిద్ధపరచి న్యాయస్థానాల్లో వేయబడుతున్న కేసులకు గవర్నమెంట్ ప్లీడర్స్ ద్వారా న్యాయస్థానాలలో వేయబడిన కేసులు గెలుపొందే విధంగా సమాజానికి కనువిప్పు కలిగేలా తగు జాగ్రత్తలు చేపట్టాలని సూచించారు. ప్రభుత్వ గొప్పతనాన్ని హైడ్రా కాపాడుతూ చాటిచెప్పుతున్నందున పనికట్టుకొని హైడ్రాను విమర్శించే శక్తులు పెరిగిపోతున్నందునే హైడ్రా సేవలను గుర్తిస్తున్న ప్రజాస్వామ్యవాదులు ప్రజా సంఘాలు మేధావులు స్వచ్ఛందంగా హైడ్రాకు అండగా సహకారంగా నిలుస్తున్నారని కొనియాడారు. నాలా చెరువు శిఖం లాంటి భూముల్లో ఎన్ని అధికారిక వ్యవస్థల అనుమతులు ఉన్న చెల్లుబాటు కావనేది చట్టాలు న్యాయస్థానాలు గుర్తుతెరిగితే సరిపోతుందన్నారు. ఎన్నో మానసిక ఒత్తిళ్లను తట్టుకొని నిలబడుతూ వ్యవస్థను కాపాడాలి అనే గొప్పతనాన్ని సగౌరవంగా చాటిచెబుతున్నా హైడ్రా కమిషనర్ ఏవి రంగనాథ్ ఐపీఎస్ సేవలు ఇప్పుడున్న స్థాయి కన్నా మరెన్నో రేట్లు దృఢ సంకల్పంతో ముందుకు సాగాలని వాటికి అన్ని ప్రభుత్వ వ్యవస్థలతో పాటు న్యాయస్థానాలు సంపూర్ణమైన సహకారాన్ని అందిస్తూ హైడ్రాకు రక్షణగా నిలవాలని పిలుపునిచ్చారు.

## కర్ల రాజేశ్ మరణంపై చర్యలు తీసుకోవాలని డిమాండ్

**సూర్యాపేట ఎస్పీని కలిసిన ఎమ్మార్పీఎస్ అధినేత పద్మశ్రీ మందకృష్ణ మాదిగ**

**సూర్యాపేట(జై భీమ్ న్యూస్)**

కోదాడ పట్టణానికి చెందిన మాదిగ యువకుడు కర్ల రాజేశ్ అనుమానాస్పద మరణంపై రాష్ట్రవ్యాప్తంగా ఆగ్రహం వ్యక్తమవుతుండగా, ఈ ఘటనలో న్యాయం జరగాలని కోరుతూ ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షులు పద్మశ్రీ మందకృష్ణ మాదిగ ఈరోజు సూర్యాపేట జిల్లా ఎస్పీ నరసింహా గారిని కలిసి వినతిపత్రం సమర్పించారు. కర్ల రాజేశ్‌పై ఏ కేసు నమోదు చేయకుండానే నాలుగు రోజుల పాటు పోలీసులు అక్రమ నిర్బంధంలో ఉంచి, పోలీస్ స్టేషన్‌లో దారుణంగా చిత్రహింసలకు గురిచేసినట్లు ఆరోపణలు వ్యక్తమవుతుండగా, ఆ చిత్రహింసల ఫలితంగానే అతడు మరణించాడని మందకృష్ణ మాదిగ పేర్కొన్నారు. ఈ ఘటనకు బాధ్యులైన చిలుకూరు ఎస్పై సురేష్ రెడ్డి మరియు కోదాడ రూరల్ సీఐలపై వెంటనే హత్యాయత్నం,హత్య కేసు నమోదు చేయడంతో పాటు ఎస్సీ,ఎస్టీ అట్రాసిటీ చట్టం కింద కేసు నమోదు చేయాలని, విచారణ పూర్తయ్యే వరకు బాధ్యులైన అధికారులను తక్షణమే సస్పెండ్ చేయాలని ఆయన డిమాండ్ చేశారు. అంతేకాక బాధిత కుటుంబానికి ప్రభుత్వంవారి నుండి ఆర్థిక సహాయం,న్యాయ సాయం మరియు రక్షణ కల్పించాలని కూడా విజ్ఞప్తి చేశారు. దాదాపు ఒక గంట పాటు జరిగిన సమావేశంలో,మొత్తం ఘటన, పోలీసుల వ్యవహారం, అక్రమ నిర్బంధం మరియు నిర్లక్ష్యం గురించి ఎస్పీ గారికి వివరించిన మందకృష్ణ మాదిగ, పోలీసులు చట్టాన్ని రక్షించాల్సిన స్థానంలో స్వయంగా చట్టాన్ని ఉల్లంఘించి అణగారిన వర్గాలపై అఘాయిత్యాలు చేయడం అంగీకారయోగ్యం కాదని తీవ్రంగా ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఎస్పీ నరసింహ స్పందిస్తూ, కేసుపై నిష్పక్షపాత దర్యాప్తు చేసి బాధ్యులపై చట్టబద్ధమైన చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో స్థానిక ఎమ్మార్పీఎస్ నాయకులు, మాదిగ లాయర్ ఫెడరేషన్ ( ఎమ్మెల్యేఫ్) న్యాయవాదుల బృందం మరియు మాదిగ యువ నాయకులు పాల్గొన్నారు. కర్ల రాజేశ్ మరణంపై రాష్ట్రవ్యాప్తంగా మాదిగ సంఘాలు నిరసనలు వ్యక్తం చేస్తున్నాయి. న్యాయం కోసం పోరాటం కొనసాగుతుందని నేతలు స్పష్టం చేస్తున్నారు.

## హైదరాబాద్ నుంచి వరంగల్‌కు వందే భారత్ రైల్లో ప్రయాణించిన కేంద్రమంత్రి

**వరంగల్ రైల్వే స్టేషన్‌లో చాయ్ పే చర్చ కార్యక్రమం నిర్వహించిన కిషన్ రెడ్డి**
**భద్రకాళి అమ్మవారిని దర్శించుకున్న కిషన్ రెడ్డి**
**వరంగల్ విమానాశ్రయ పనులు వేగవంతం చేయాలని నిర్ణయించినట్లు వెల్లడి**

**వరంగల్, నవంబర్ 29 (జై భీమ్ న్యూస్) :**

కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి హైదరాబాద్ నుండి వందే భారత్ ఎక్స్‌ప్రెస్ రైలులో ప్రయాణించి వరంగల్ చేరుకున్నారు. వరంగల్ రైల్వే స్టేషన్ అభివృద్ధి పనులను ఆయన పరిశీలించారు. అనంతరం రైల్వే స్టేషన్ క్యాంటీన్‌లో 'చాయ్ పే' చర్చ కార్యక్రమాన్ని నిర్వహించారు. వరంగల్ నగరంలోని భద్రకాళి అమ్మవారిని దర్శించుకున్నారు. నగరంలో పలు అభివృద్ధి పనులపై అధికారులతో సమీక్షించిన అనంతరం కిషన్ రెడ్డి మీడియాతో మాట్లాడారు. వరంగల్ విమానాశ్రయ పనులను వేగవంతం చేయాలని నిర్ణయించినట్లు ఆయన చెప్పారు. ఇక్కడి నుండి తొలుత ఏటీఆర్ విమానాలు నడపాలని భావిస్తున్నామని, తర్వాత స్పందనను బట్టి మరిన్ని సర్వీసులు నడుపుతామని అన్నారు. కాజీపేట రైల్వే కోచ్ ఫ్యాక్టరీ నిర్మాణ పనులు వేగంగా సాగుతున్నాయని కేంద్ర మంత్రి అన్నారు. అమృత్ పథకం కింద వరంగల్ జిల్లాకు రూ.874 కోట్లు మంజూరైనట్లు ఆయన వెల్లడించారు. కాజీపేట రైల్వే స్టేషన్ ఆధునికీకరణ పనులు త్వరగా పూర్తి చేయాలని చెప్పామని అన్నారు. హృదయ్ పథకం కింద పురాతన ఆలయాల పునరద్ధరణకు కేంద్రం నిధులు ఇచ్చిందని, ఇందులో భాగంగా రామప్ప ఆలయ అభివృద్ధి కోసం కేంద్రం రూ.146 కోట్లు ఖర్చు చేస్తోందని ఆయన అన్నారు.

## కేబీఆర్ పార్క్ వద్ద స్మార్ట్ పార్కింగ్.. నేటి నుంచే ప్రారంభం

**కేబీఆర్ పార్క్ వద్ద పార్కింగ్ కష్టాలకు చెక్.. ఇక ట్రాఫిక్ జామ్‌కు చెక్**
**72 కార్లు, ద్విచక్రవాహనాలు పార్క్ చేసేందుకు సౌకర్యం**
**మొబైల్ యాప్‌తో ముందుగానే స్లాట్ బుకింగ్ చేసుకునే వీలు**

**హైదరాబాద్, నవంబర్ 29 (జై భీమ్ న్యూస్) :**

హైదరాబాద్ నగరంలోని కేబీఆర్ పార్క్ వద్ద వాహనదారుల పార్కింగ్ కష్టాలకు జీహెచ్ఎంసీ చెక్ పెట్టింది. అధునాతన సాంకేతిక పరిజ్ఞానంతో నిర్మించిన ఆటోమేటెడ్ స్మార్ట్ రోటరీ పార్కింగ్ వ్యవస్థను నేటి నుంచి అందుబాటులోకి తీసుకువచ్చింది. ఈ సదుపాయంతో జాతీయ ఉద్యానవనం వద్ద ట్రాఫిక్ సమస్యలు తగ్గుముఖం పడతాయని అధికారులు భావిస్తున్నారు. కేబీఆర్ పార్కుకు ఉదయం, సాయంత్రం వేళల్లో వాకింగ్, జాగింగ్ కోసం వచ్చేవారు తమ వాహనాలను ప్రధాన రహదారిపైనే నిలుపుతుండటంతో తీవ్ర ట్రాఫిక్ సమస్యలు తలెత్తుతున్నాయి. సికింద్రాబాద్, బేగంపేట, పంజాగుట్ట వంటి ప్రాంతాల నుంచి ఐటీ కారిడార్‌కు వెళ్లేందుకు ఇది కీలక మార్గం కావడంతో, రద్దీ సమయాల్లో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఈ సమస్యకు పరిష్కారంగా జీహెచ్ఎంసీ మల్టీ లెవల్ స్మార్ట్ పార్కింగ్ నిర్మాణాన్ని చేపట్టింది. ప్రైవేట్ ఏజెన్సీ భాగస్వామ్యంతో 405 చదరపు గజాల స్థలంలో ఈ పార్కింగ్ వ్యవస్థను ఏర్పాటు చేశారు. ఇందులో ఒకేసారి 72 కార్లను పార్క్ చేసే వీలుంది. మొత్తం స్థలంలో 20 శాతం ద్విచక్ర వాహనాల కోసం కేటాయించారు. ఉదయం 5 గంటల నుంచి రాత్రి 11 గంటల వరకు ఈ సేవలు అందుబాటులో ఉంటాయి. ప్రత్యేక మొబైల్ యాప్ ద్వారా ముందుగానే పార్కింగ్ స్లాట్‌ను బుక్ చేసుకునే సదుపాయాన్ని కూడా కల్పిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు.

## స్టాక్ మార్కెట్ ట్రేడింగ్ పేరుతో భారీ మోసం

**ముఠాను అరెస్ట్ చేసిన సైబర్ క్రైమ్ పోలీసులు**

**హైదరాబాద్,నవంబరు29 (జై భీమ్ న్యూస్):**

స్టాక్ మార్కెట్ ట్రేడింగ్ పేరుతో భారీ మోసాలకు పాల్పడుతున్న ముఠాను హైదరాబాద్ సైబర్ క్రైమ్ పోలీసులు అరెస్టు చేశారు. ముంబయిలో ఇద్దరిని అరెస్టు చేయగా.. వారిలో ప్రధాన నిందితుడు రవికుమార్‌తో పాటు మ్యూల్ బ్యాంక్ అకౌంట్లు సమకూరుస్తున్న శివేంద్ర అశోక్ సింగ్ ఉన్నారు. హైదరాబాద్‌కు చెందిన వ్యక్తికి ట్రేడింగ్ పేరుతో రూ.12.30 లక్షలు మోసం చేసినట్లు సమాచారం. నిందితులపై దేశవ్యాప్తంగా 12 కేసులు ఉన్నట్లు గుర్తించారు. నిందితుల విచారణలో మరిన్ని విషయాలు వెలుగులోకి వచ్చే అవకాశముందని పోలీసులు భావిస్తున్నారు. సమాచారం తెలుసుకున్న పోలీసులు వీరిని వలపన్ని పట్టుకున్నారు.

## సర్పంచ్ ఎన్నికల బరిలో నిలిచిన మాజీ మావోయిస్టు నేత జ్యోతి

**రాజన్న సిరిసిల్ల జిల్లా శివంగలపల్లి నుంచి పోటీ**
**19 ఏళ్ల పాటు మావోయిస్టు పార్టీలో పనిచేసిన నేపథ్యం**
**ప్రజాసేవ కోసమే ఎన్నికల్లో నిలబడ్డానని వెల్లడి**

**రాజన్న సిరిసిల్ల, నవంబర్ 29 ( జై భీమ్ న్యూస్) :**

తెలంగాణలో జరుగుతున్న పంచాయతీ ఎన్నికలు ఆసక్తికరంగా మారాయి. రాజన్న సిరిసిల్ల జిల్లాలో ఒక మాజీ మావోయిస్టు నాయకురాలు సర్పంచ్ పదవికి పోటీ పడుతున్నారు. సుమారు 19 ఏళ్ల పాటు మావోయిస్టు పార్టీలో క్రియాశీలకంగా పనిచేసిన నేరెళ్ల జ్యోతి, ఇప్పుడు తన సొంతూరి నుంచే సర్పంచ్‌గా బరిలోకి దిగారు. వివరాల్లోకి వెళ్తే, కోనరావుపేట మండలం శివంగలపల్లి గ్రామానికి చెందిన నేరెళ్ల జ్యోతి సర్పంచ్ అభ్యర్థిగా నామినేషన్ దాఖలు చేశారు. 2005లో దళ సభ్యురాలిగా చేరిన జ్యోతి, అనతికాలంలోనే జిల్లా కమిటీ సభ్యురాలి స్థాయికి, రాష్ట్ర ప్రెస్ ఇన్‌చార్జిగానూ బాధ్యతలు చేపట్టారు. అయితే, అనారోగ్య కారణాల వల్ల 2023లో ఆమె కరీంనగర్ ఎస్పీ ఎదుట లొంగిపోయి జనజీవన స్రవంతిలో కలిశారు. ప్రస్తుతం జరుగుతున్న పంచాయతీ ఎన్నికల్లో శివంగలపల్లి సర్పంచ్ స్థానాన్ని బీసీ మహిళకు కేటాయించారు. దీంతో తనకు ప్రజాసేవ చేసే అవకాశం లభించిందని భావించిన జ్యోతి, ఎన్నికల బరిలో నిలిచేందుకు నిర్ణయించుకున్నారు. మావోయిస్టుగా ఉన్నప్పుడు కూడా ప్రజా సమస్యలపైనే పోరాడానని, ఇప్పుడు సర్పంచ్‌గా గెలిచి గ్రామ ప్రజలకు సేవ చేయాలనే లక్ష్యంతోనే పోటీ చేస్తున్నానని ఆమె తెలిపారు.

## 1నుంచి పార్లమెంట్ శీతాకాల సమావేశాలు

**రాజ్‌నాథ్ అధ్యక్షతన నేడు అఖిలపక్ష భేటీ**

**న్యూఢిల్లీ,నవంబరు29 (జై భీమ్ న్యూస్):**

పార్లమెంటు శీతాకాల సమావేశాలు డిసెంబర్ 1వ తేదీ నుంచి ప్రారంభం కానున్నాయి. డిసెంబర్ 19వ తేదీ వరకూ ఈ సమావేశాలు జరుగుతాయి. సమావేశాలకు ముందు సంప్రదాయంగా నిర్వహించే అఖిలపక్ష సమావేశాన్ని ఆదివారం ఉదయం 11 గంటలకు నిర్వహించ నున్నారు. కేంద్ర రక్షణ శాఖ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ అధ్యక్షతన ఈ అఖిలపక్ష సమావేశం జరుగనుంది. పార్లమెంటు సమావేశాలు సజావుగా జరిగేలా సహకరించాలని కేంద్రం కోరనుంది. సోమవారం నుంచి ప్రారంభమయ్యే పార్లమెంటు శీతాకాల సమావేశాల్లో పలు అంశాలపై చర్చకు విపక్షం కసరత్తు చేస్తోంది. సర్‌తో సహా ఢిల్లీ కాలుష్యం తదితర అంశాలు చర్చకు వచ్చే అవకాశం ఉంది. ఇకపోతే కీలకమైన పౌర అణు ఇంధన రంగంలో ప్రైవేటు రంగానికి ఆహ్వానం పలికేందుకు ఉద్దేశించిన ’ది ఆటమిక్ ఎనర్జీ బిల్లు-2025’తో సహా 10 కీలక బిల్లులు సభ ముందుకు రానున్నాయి. పార్లమెంటులో ప్రవేశపెట్టనున్న కీలకమైన బిల్లులలో ’ది ఆటకమిక్ ఎనర్జీ బిల్లు-2025’తో పాటు సెక్యూరిటీస్ మార్కెట్స్ కోడ్ బిల్లు (ఎస్ఎంసి)-2025, జాతీయ రహదారుల (సవరణ) బిల్లు, అర్బిట్రేషన్, కాన్సిలియేషన్ (సవరణ) బిల్లు, ఇన్సూరెన్స్ చట్ట (సవరణ) బిల్లు, ఇన్సాల్వెన్సీ, దివాలా కోడ్ (సవరణ) బిల్లు, కార్పొరేట్ చట్ట (సవరణ) బిల్లు, ది హైయర్ ఎడ్యుకేషన్ కమిషన్ ఆఫ్ ఇండియా బిల్లు-2025, ది మణిపూర్ గూడ్స్ అండ్ సర్వీసెస్ టాక్స్ (సవరణ) బిల్లు-2025, జన్ విశ్వాస్ (నిబంధనల సవరణ) బిల్లు-2025 ఉండనున్నాయి. సెక్యూరిటీస్ అండ్ ఎక్స్ఛేంజ్ బోర్డ్ ఆఫ్ ఇండియా చట్టం-1992, డిపాజిటరీస్ చట్టం-1996, సెక్యూరిటీస్ కాంట్రాక్ట్స్ (నియంత్రణ) చట్టం-1956లను విలీనం చేసేందుకు ’సెక్యూరిటీస్ మార్కెట్స్ కోడ్ బిల్లు-2025’ను కేంద్రం తీసుకువస్తోంది. జాతీయ రహదారుల విస్తరణ, పొడిగింపుకోసం అవసరమైన భూసేకరణ పక్రియ వేగంగా, అత్యంత పారదర్శకంగా జరిగేందుకు వీలుగా నేషనల్ హైవేస్ (సవరణ) బిల్లును తెస్తోంది. చేయని తప్పులకు కంపెనీ డైరెక్టర్లు బాధ్యులు అవుతున్నందున అవాంఛనీయ దర్యాప్తు, విచారణల నుంచి రక్షణ కల్పించాలని సుప్రీంకోర్టు ఇచ్చిన ఆదేశాల మేరకు ఆర్బిట్రేషన్, కాన్సిలేయేషన్ చట్ట సవరణ బిల్లును పార్లమెంటులో కేంద్రం ప్రవేశపెట్టనుంది. దీనిపై సూచనల కోసం కమిటీకి సిఫారసు చేసే అవకాశం ఉంది. కాగా, ది హయ్యర్ ఎడ్యుకేషన్ కమిషన్ ఆఫ్ ఇండియా బిల్లుతో ఏకీకృత ఉన్నత విద్యా కమిషన్ ఏర్పాటుకు కేంద్ర ప్రభుత్వం కొత్త బిల్లు తీసుకురానుంది. కాగా, చండీగఢ్ కేంద్ర పాలిత ప్రాంతాన్ని రాజ్యాంగంలోని 240వ అధికరణ పరిధిలోకి తెచ్చే బిల్లు పార్లమెంటులో ప్రవేశపెడతారని అనుకున్నప్పటికీ అలాంటి ఆలోచన ఏదీ లేదని ఇటీవల కేంద్రం ప్రకటించింది. కాగా, ఈసారి పార్లమెంటు శీతాకాల సమావేశాల్లో పలు అంశాలను లేవనెత్తేందుకు విపక్షాలు కసరత్తు చేస్తున్నాయి. ప్రధానంగా ఎస్ఐఆర్ ఓటర్ల సవరణ జాబితా, అదానీ అంశం, ఢిల్లీ పొల్యూషన్ వంటి అంశాలను లేవనెత్తే అవకాశాలున్నాయి. దీనికి సంబంధించిన విపక్ష నేత రాహుల్ ఇప్పటికే ప్రకటన చేశారు.

## తెలంగాణలో పంచాయతీ ఎన్నికలు..

**ముగిసిన మొదటి విడత నామినేషన్లు**
**శనివారం సాయంత్రంతో ముగిసిన మొదటి విడత నామినేషన్ల గడువు**
**మొదటి విడతలో 4,236 గ్రామ పంచాయతీలు, 37,440 వార్డుల్లో నామినేషన్ల స్వీకరణ**
**వచ్చే నెల 11న పోలింగ్, ఓట్ల లెక్కింపు**

**హైదరాబాద్, నవంబర్ 29 (జై భీమ్ న్యూస్) :**

తెలంగాణ రాష్ట్రంలో పంచాయతీ ఎన్నికల మొదటి దశకు సంబంధించిన నామినేషన్ల స్వీకరణ గడువు శనివారం సాయంత్రంతో ముగిసింది. మొదటి విడతలో 4,236 గ్రామ పంచాయతీలకు, 37,440 వార్డులకు నామినేషన్లు స్వీకరించారు. ఆదివారం నామినేషన్ల పరిశీలన ఉంటుందని, అదే రోజు చెల్లుబాటు అయిన నామినేషన్ల వివరాలు వెల్లడిస్తారని అధికారులు తెలిపారు. సోమవారం అప్పీలు స్వీకరణ, డిసెంబర్ 2న అప్పీళ్ల పరిష్కారం ఉంటుందని పేర్కొన్నారు. డిసెంబర్ 3న నామినేషన్ల ఉపసంహరణ గడువు ముగుస్తుంది. అదే రోజు పోటీలో ఉన్న అభ్యర్థుల వివరాలను వెల్లడిస్తారు. వచ్చే నెల 11న పోలింగ్, ఓట్ల లెక్కింపు, ఉపసర్పంచ్ ఎన్నిక జరుగుతాయని అధికారులు తెలిపారు. రేపటి నుండి డిసెంబర్ 2 వరకు రెండవ విడత ఎన్నికల నామినేషన్లు స్వీకరించనున్నారు. రెండవ విడతలో 193 మండలాల్లోని 4,333 పంచాయతీలకు, 38,350 వార్డులకు ఎన్నికలు జరగనున్నాయి. ఇదిలా ఉండగా, వికారాబాద్ తాండూరు మండలంలో సర్పంచ్, వార్డు స్థానాలకు నామినేషన్లు దాఖలు చేసే ప్రక్రియరాత్రి 7 గంటలు దాటినా కొనసాగింది. పదుల సంఖ్యలో అభ్యర్థులు ఉండటంతో రాత్రి 9 గంటల వరకు ప్రక్రియ కొనసాగుతుందని అధికారులు వెల్లడించారు. సాయంత్రం 5 గంటలకు నామినేషన్ల గడువు ముగిసింది. ఆ సమయానికి క్యూలో ఉన్న అభ్యర్థులకు టోకెన్లు జారీ చేసి నామినేషన్ పత్రాల దాఖలుకు అనుమతిస్తున్నారు.

## ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని కలిసిన శుభలేఖ సుధాకర్

**ఎస్పీ బాలసుబ్రహ్మణ్యం విగ్రహావిష్కరణ కార్యక్రమానికి ఆహ్వానం**
**రవీంద్ర భారతి ఆవరణలో విగ్రహావిష్కరణ**
**విగ్రహ ఏర్పాటుకు అనుమతించినందుకు కృతజ్ఞతలు తెలిపిన సుధాకర్**

**హైదరాబాద్, నవంబర్ 29 (జై భీమ్ న్యూస్) :**

తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని ప్రముఖ సినీ నటుడు శుభలేఖ సుధాకర్ మర్యాదపూర్వకంగా కలిశారు. డిసెంబర్ 15న రవీంద్ర భారతి ఆవరణలో దివంగత ఎస్పీ బాలసుబ్రహ్మణ్యం విగ్రహావిష్కరణ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేయాల్సిందిగా ముఖ్యమంత్రిని ఆహ్వానించారు. రవీంద్ర భారతి ఆవరణలో విగ్రహ ఏర్పాటుకు అనుమతించినందుకు ఎస్పీ బాలు కుటుంబం తరఫున ముఖ్యమంత్రికి కృతజ్ఞతలు తెలియజేశారు. గాయకుడు బాలసుబ్రహ్మణ్యం తెలుగు, తమిళ, కన్నడ, హిందీ తదితర భాషల్లో సుమారు 40 వేలకు పైగా పాటలు పాడి శ్రోతల హృదయాల్లో చిరస్థాయిగా నిలిచిపోయారు. అంతేకాకుండా పలు తెలుగు, తమిళ చిత్రాల్లో నటించి మెప్పించారు. సినిమాల్లోనే కాకుండా టీవీ రంగంలో ఆయన పాడుతా తీయగా, పాడాలని ఉంది లాంటి కార్యక్రమాలను నిర్వహించి ఎంతోమంది నూతన గాయనీ, గాయకులను వెలుగులోకి తెచ్చారు. ఆయన 2020 సెప్టెంబర్ 25న కన్నుమూశారు.



# ప్రజలారా మేల్కోండి

**సర్పంచ్ ఎన్నికల్లో పోటీ చేస్తున్న అభ్యర్థులతో జెరా ఫైల్**
**రాజకీయ రొంపులో రంగుల మార్పు**
**విశ్వాసఘాతకులే విశ్వరూపం ప్రదర్శిస్తున్నారు**

**ఐనవోలు, నవంబర్ 29 (జై భీమ్ న్యూస్)**

ఐనవోలు మండలంలో రాజకీయ పరిణామాలు అతివేగంగా మారుతూ ప్రత్యేకత సంతరించుకుంటున్నాయి. ఊసరవెల్లి రంగులు మార్చినట్టు రాజకీయ నాయకులు పదవుల కోసం, అక్రమ ఆస్తులు కాపాడుకోవడం కోసం పార్టీ ఫిరాయింపులకు పాల్పడుతూ పుట్టగొడుగుల్లా పార్టీలు మారుతున్నారు. ఓట్లు వేసి గెలిపించిన సామాన్య ప్రజలను గాలికి వదిలేసి, పరిపాలన-అభివృద్ధి అంటూ వ్యక్తిగత రాజకీయాలకు రంగులు పూస్తున్నారు. నాయకుడి గెలుపులో వ్యక్తిగతంగా కష్టపడిన నిమ్నస్థాయి నాయకులు, పార్టీ కోసం పనిచేసిన కార్యకర్తలు మండలంలోని అన్ని గ్రామాల్లో అభివృద్ధి కోసం ప్రజలు మమేకమై సర్పంచ్ ఎన్నికల్లో నిజాయితీ గల అభ్యర్థులను ఏకగ్రీవంగా ఎన్నుకోవడంతోపాటు, గెలుపొందని గ్రామాల్లో ప్రజల కష్టాలు తీర్చుకోవాలని విశ్వప్రయత్నాలు చేస్తున్నారు. పార్టీలు మారడంలో రెప్పపాటు కాలం ఆలస్యం చేయని సర్పంచ్ ఎన్నికల్లో గెలుపొందే నాయకులు స్వార్థపూరిత రాజకీయాలకు పాల్పడుతూ, వ్యక్తిగత విశ్వాసాన్ని పక్కనపెట్టి, తమ గెలుపులో కీలక పాత్ర పోషించిన ప్రజలను మోసం చేయడానికి మరోసారి సంసిద్ధులవుతున్నారు. ఐనవోలు మండల ప్రజల అభివృద్ధి ఎటు పోతుందోనని, గ్రామ గ్రామానా పేరుకుపోయిన సమస్యలు పరిష్కార మార్గం కోసం కాలుగజ్జి కట్టి గంతులేసే పరిస్థితి తలెత్తేలా ఉందని ప్రజలు గగ్గోలు పెడుతున్నారు. పుట్టగొడుగులు పుట్టకో పార్టీ మారుతున్న నకిలీ నాయకులతో సామాన్య ప్రజలు తెగ తిప్పలు పడుతున్నారు. ఎన్నికల ముందు ఒక మాట, ఎన్నికలయ్యాక మరో మాట మారుస్తున్నారంటూ ప్రతి రాజకీయ పార్టీపై ప్రజలు విరక్తి చెందుతున్నారు.




# ట్రాఫిక్ చలానాలపై హైకోర్టు సీరియస్... ఆ హక్కు మీకు లేదంటూ

**హైదరాబాద్, నవంబర్ 29 (జై భీమ్ న్యూస్)**

తెలంగాణలో ట్రాఫిక్ ఉల్లంఘనలపై ఈ-చలాన్లు విధించే విధానంపై తెలంగాణ హైకోర్టు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేసింది. చలాన్ల అమలులో పారదర్శకత లేదంటూ వి. రాఘవేంద్ర చారి దాఖలు చేసిన రిట్ పిటిషన్‌ను విచారించిన న్యాయస్థానం ఈ అంశంపై పూర్తి వివరణ ఇవ్వాలని రాష్ట్ర హోం శాఖకు నోటీసులు జారీ చేసింది. నాలుగు వారాల్లోగా కౌంటర్ అఫిడవిట్ దాఖలు చేయాలని హైకోర్టు ఆదేశించింది. పిటిషనర్ రాఘవేంద్ర చారి ట్రాఫిక్ పోలీసుల అమలు పద్ధతుల చట్టబద్ధతను ప్రశ్నించారు. తమకు కేటాయించిన అధికారిక పరికరాలకు బదులుగా సొంత మొబైల్ ఫోన్లతో వాహనాల ఫోటోలు తీసి చలాన్లు జారీ చేస్తున్నారని, తనపైనా అలాగే మూడు చలాన్లు విధించారని కోర్టుకు తెలిపారు. వ్యక్తిగత మొబైల్ ఫోన్లు లేదా ధృవీకరించబడని పరికరాల ద్వారా తీసిన ఫోటోలు చట్టపరమైన సాక్ష్యంగా చెల్లవని, ప్రభుత్వం ఆమోదించిన నిఘా కెమెరాల ద్వారా మాత్రమే ట్రాఫిక్ ఉల్లంఘనలను రికార్డు చేయాలని పిటిషనర్ వాదించారు. చట్టబద్ధత లేని పద్ధతిలో చలాన్లు వేయడం వల్ల వాహనదారుల హక్కులు దెబ్బతింటాయని న్యాయస్థానం వ్యాఖ్యానించింది. ట్రాఫిక్ పోలీసు సిబ్బంది చట్టవిరుద్ధంగా జరిమానా మొత్తాలను నిర్ణయించడం, న్యాయ పర్యవేక్షణ లేకుండా డబ్బు వసూలు చేయడంపైనా పిటిషనర్ అభ్యంతరం తెలిపారు. శిక్ష నిర్ణయించే అధికారం కేవలం జ్యుడీషియల్ మేజిస్ట్రేట్‌కు మాత్రమే ఉంటుందని, క్షేత్రస్థాయి కానిస్టేబుళ్లు లేదా ఇన్‌స్పెక్టర్లకు ఆ హక్కు లేదని స్పష్టం చేశారు. 2011 నాటి ప్రభుత్వ ఉత్తర్వు (జీవో నెం. 108)ని కూడా ఈ రిట్ పిటిషన్ సవాలు చేసింది. ఈ జీవో పోలీసులకు వాహనాలను ఆపి, కాంపౌండ్ జరిమానాలు అక్కడికక్కడే వసూలు చేయడానికి అధికారం ఇస్తుంది. ఈ జీవో చట్టవిరుద్ధం, రాజ్యాంగ విరుద్ధం, ప్రాథమిక హక్కులను ఉల్లంఘిస్తుందని పిటిషనర్ ఆరోపించారు. జస్టిస్ మాధవీ దేవి ప్రాథమిక వాదనలు విన్న తర్వాత చలాన్ల ఎన్‌ఫోర్స్‌మెంట్ విధానంపై పూర్తి నివేదిక దాఖలు చేయాలని హోం శాఖకు నాలుగు వారాల సమయం ఇచ్చారు.




# రాయపర్తి మండలంలో పంచాయతీ ఎన్నికల హడావిడి

**రాయపర్తి (జై భీమ్ న్యూస్)**

రాయపర్తి మండలంలో పంచాయతీ ఎన్నికల హోరాహోరీ పోటీ పూర్తి స్థాయిలో ఊపందుకుంది. మొత్తం 40 గ్రామ పంచాయతీల్లో సర్పంచ్ మరియు వార్డు సభ్యుల స్థాయిలకు రికార్డు స్థాయిలో నామినేషన్లు దాఖలు కావడంతో స్థానిక రాజకీయ వాతావరణం పూర్తిగా వేడెక్కిపోయింది. ఈ వివరాలను అసిస్టెంట్ జిల్లా ఎన్నికల అధికారి %ఎ% మండల పరిషత్ అభివృద్ధి అధికారి అధికారికంగా ప్రకటించారు. ఈసారి ఎన్నికల్లో గ్రామస్థాయి రాజకీయాలు ఇంతకుముందెన్నడూ లేనంతగా ఉత్కంఠభరితంగా మారాయి. ప్రజాప్రతినిధుల పోటీ మాత్రమే కాకుండా వర్గీకరణలు,పార్టీల మద్దతు, స్థానిక నాయకుల ప్రభావం, సామాజిక సమీకరణాలు కీలక పాత్ర పోషించనున్నాయి.

**మొత్తం నామినేషన్లు..**

గ్రామాల సంఖ్య..40

సర్పంచ్ నామినేషన్లు...269

వార్డు సభ్యుల నామినేషన్లు 719

ఈ సంఖ్యలు ఈసారి పంచాయతీ ఎన్నికలు ఎంత తీవ్రంగా జరిగే అవకాశముందో స్పష్టంగా తెలియజేస్తున్నాయి.

**అత్యధిక నామినేషన్లు వచ్చిన గ్రామాలు..**

వార్డు సభ్యుల విభాగంలో మైలారం గ్రామం 46 నామినేషన్లతో తొలి స్థానంలో నిలిచింది. రాయపర్తి గ్రామం 37 నామినేషన్లతో రెండో స్థానంలో, కొండూరు గ్రామం 34 నామినేషన్లతో మూడో స్థానంలో నిలిచాయి. సర్పంచ్ నామినేషన్ల విభాగంలో కొండూరు మరియు రాయపర్తి గ్రామాలు తలా 13 నామినేషన్లతో ప్రత్యేకంగా కనిపించాయి.

**గ్రామాలవారీ నామినేషన్ వివరాలు..**

వెంకటేశ్వరపల్లి (5-17), సన్నూర్ (7-16), బాలునాయక్ తండా (2-15), జయరాం తాండా (ఎస్) (11-9), బాలాజీ నగర్ (1-6), ఉకల్ (5-29), పనిష్ తండా (5-14), గట్టికల్ (11-18), కొత్తూరు (5-23), బంధన్‌పల్లి (6-17), అవుసులకుంట తాండా (8-14), పెరికేడు (6-25), సూర్య తండా (6-15), కొండాపూర్ (5-17), రాగన్నగూడెం (3-12), గణేష్ కుంట తాండా (7-16), మహబూబ్ నగర్ (5-17), మైలారం (11-46), దుబ్బతండా (6-15), జగన్నాధపల్లి (10-28), మురిపిరాల (2-8), శివరామపురం (5-17), పన్యానాయక్ తాండా (10-20), కిష్టపురం (1-15), కాట్రపల్లి (7-21), వాంకుడోతు తండా (6-14), పోతిరెడ్డి పల్లి (5-14), కొండూరు (13-34), బుర్హాన్‌పల్లి (5-21), కోలన్‌పల్లి (4-22), ఆరెగూడెం (6-13), జయరాం తాండా (కె) (8-11), కేశవాపూర్ (11-18), జింకురం తండా (5-14), ఎర్రకుంట తాండా (3-10), గన్నారం (8-17), తిరుమలాయపల్లి (12-25), తెట్టకుంట తాండా (11-11), రాయపర్తి (13-37), జేతురాం తాండా (9-8).

# విశాఖ హోటళ్లలో దారుణం

**నాసిరకం, పాచిపోయిన ఫుడ్ సరఫరా**
**అప్రమత్తంగా ఉండాలని**
**ప్రజలకు అధికారుల హెచ్చరిక**

**విశాఖపట్టణం,నవంబరు29 (జై భీమ్ న్యూస్):**

పర్యాటక నగరంగా పేరుగాంచిన విశాఖపట్నంలో కొన్ని హోటళ్లు, రెస్టారెంట్ల నిర్వాహకులు కస్టమర్ల ఆరోగ్యంతో చెలగాటమాడుతున్నారు. పేరుకు మాత్రమే హంగులతో ఆకర్షిస్తూ, లోపల మాత్రం రోజుల తరబడి నిల్వ ఉంచిన పాచిపోయిన ఆహారాన్ని వేడి చేసి వడ్డిస్తున్నారు. రుచి కోసం రకరకాల రంగులు, హానికరమైన రసాయనాలు కలుపుతూ ప్రజల జీవితాలను ప్రమాదంలోకి నెడుతున్నారు. ఫుడ్ సేఫ్టీ అధికారులు ఎన్నిసార్లు తనిఖీలు చేపట్టినా యాజమాన్యాల తీరు మారకపోవడం ఆందోళన కలిగిస్తోంది. ఇలాంటి హోటళ్ల విషయంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని హెచ్చరించారు. తాము తినే పదార్థాలు తాజావా కాదా అని నిర్ధారించుకోవాలని హచ్చరించారు. నగరంలో హోటళ్ల అరాచకం రోజురోజుకూ పెరిగిపోతున్న నేపథ్యంలో, ఆహార భద్రతా ప్రమాణాల శాఖ అధికారులు మెరుపు దాడులు నిర్వహిస్తున్నారు. ఈ తనిఖీల్లో అధికారులకు కళ్లు బైర్లు కమ్మే దృశ్యాలు దర్శనమిస్తున్నాయి. దాదాపు ఏ రెస్టారెంట్ చూసినా కల్తీగా మారిపోయింది.ఈ ఏడాది ఆగస్టు నెలలో జిల్లా వ్యాప్తంగా నిర్వహించిన విస్తృత తనిఖీల్లో 40 హోటళ్లు, రెస్టారెంట్లలో కిలోల కొద్దీ నిల్వ ఆహార పదార్థాలను అధికారులు స్వాధీనం చేసుకున్నారు. ముఖ్యంగా 17 హోటళ్లలో అత్యంత దారుణ స్థితిలో ఉన్న ఆహారాన్ని గుర్తించి, వాటిపై కేసులు నమోదు చేశారు. అక్కయ్యపాలెంలోని నరసింహ నగర్ లో ముంతాజ్ హోటల్ ఈ ఏడాది జూన్ నెలలో జరిపిన తనిఖీల్లో ఇక్కడ కుళ్లిపోయిన కోడిగుడ్లు, చికెన్, చేప, రొయ్య వంటకాలను గుర్తించారు. హోటల్‌పై కేసు కూడా నమోదు చేశారు. అలాగే, ఏంవీపీ కాలనీలో గల ఆహా ఏమి రుచులు రెస్టారెంట్ లో ఆగస్టు 22న జరిపిన దాడుల్లో ఈ రెస్టారెంట్లో నాలుగైదు రోజులకు మించి నిల్వ ఉన్న 85 కిలోల చికెన్, మటన్, రొయ్యలు, చేపలను అధికారులు గుర్తించారు.మరో హోట్ సెలబ్రేషన్స్ పై తనిఖీ చేయగా నిల్వ ఉంచిన బిర్యానీ లభించింది. అలాగే, నగరంలో దాదాపు 1000 వరకు హోటళ్లు, రెస్టారెంట్లలో ఉన్న ఎక్కడ తనిఖీ చేసినా నిల్వ ఉంచిన ఆహార పదార్థాలు దొరకడంపై ఫుడ్ సేఫ్టీ అధికారులు కఠిన చర్యలు తీసుకుంటున్నప్పటికీ హోటల్స్ తీరు మారడం లేదు. రోజుల తరబడి నిల్వ చేసిన ఆహార పదార్థాలను తినడం వల్ల అనేక అనారోగ్య సమస్యలు వస్తాయని వైద్యులు హెచ్చరిస్తున్నారు.

# సిరిసిల్ల జిల్లాలో తల్లి-కొడుకుల ఆత్మహత్య

**మానసిక స్థితి బాగోలేక నదిలో దూకి తల్లి ఆత్మహత్య...**
**ఆవేదనతో అదే నదిలో దూకి కొడుకు (పోలీస్ కానిస్టేబుల్) కూడా ప్రాణత్యాగం**



**సిరిసిల్ల, నవంబర్ 29 (జై భీమ్ న్యూస్)**

సిరిసిల్ల జిల్లా తంగళ్లపల్లి మండల కేంద్రంలో కానిస్టేబుల్‌గా విధులు నిర్వహిస్తూ, తన తల్లి మంచికట్ల లలిత (56)తో కలిసి నివసిస్తున్న అభిలాష్ (34) గురువారం విధులు ముగించుకుని ఇంటికి వచ్చేసరికి తల్లి కనిపించకపోవడంతో తీవ్ర ఆవేదనకు గురయ్యారు. వెంటనే పోలీసులకు ఫిర్యాదు చేయడంతో గాలింపు చర్యలు ప్రారంభమయ్యాయి. శుక్రవారం ఎల్లమ్మ దేవాలయం సమీపంలోని మానేరు నదిలో లభించిన మహిళా మృతదేహం తన తల్లిదేనని గుర్తించిన అభిలాష్ తీవ్ర మనస్తాపానికి గురయ్యారు. బంధువుల ముందే అదే నదిలో దూకి ఆత్మహత్య చేసుకున్నారు. దాదాపు రెండు గంటల పాటు గాలింపు చర్యలు చేపట్టిన ఎస్‌డీఆర్‌ఎఫ్ బృందాలు అభిలాష్ మృతదేహాన్ని వెలికి తీశాయి.

# డిజిటల్ అరెస్ట్ పేరుతో మోసాలు

**అప్రమత్తంగా ఉండాల్సిన తరుణం**
**ఫేక్ కాల్స్ ఎత్తి సమాచారం ఇవ్వరాదు**
**అనుమానం ఉటే 1930కు ఫిర్యాదు చేయాలి**
**ప్రజలను అప్రమత్తం చేసిన హైదరాబాద్ సిటీ సైబర్ క్రైమ్**

**హైదరాబాద్,నవంబరు29 (జై భీమ్ న్యూస్):**

డిజిటల్ అరెస్ట్ పేరుతో దేశవ్యాప్తంగా పెరుగుతున్న కొత్త రకం సైబర్ మోసాల నేపథ్యంలో హైదరాబాద్ సిటీ సైబర్ క్రైమ్ యూనిట్ తాజాగా ప్రజలకు ముఖ్య హెచ్చరిక జారీ చేసింది. ఇలాంటి మోసాలు హైదరాబాద్‌లో కూడా విస్తరిస్తున్నాయి. నకిలీ పోలీస్, సీబీఐ, ఈడీ, కస్టమ్స్, లేదా కోరియర్ కంపెనీల అధికారులుగా నటిస్తూ కాల్ చేసే మోసగాళ్లు, మనీ లాండరింగ్, టెర్రరిజం, నార్కోటిక్స్ కేసులు, ట్రాఫికింగ్ వంటి తీవ్ర నేరాల్లో కేసులు నమోదయ్యాయని చెప్పి ప్రజలను భయపెట్టి డబ్బు లాక్కోవడం ఈ స్కాం కీలక లక్ష్యంగా పోలీసులు హెచ్చరించారు. ఇలాంటి కాల్స్ ద్వారా అప్రమత్తంగా ఉండాలని సూచించారు.. బాధితులకు వీడియో కాల్ లేదా ఫోన్ ద్వారా అరెస్ట్ చేస్తున్నాం అని నటిస్తూ, ఖాతాలను ఫ్రీజ్ చేస్తామని, వారెంట్లు జారీ అయ్యాయని నమ్మించి మోసం చేస్తారని హెచ్చరించారు. మోసగాళ్లు తమ కుట్రను బలపరచేందుకు నకిలీ వారెంట్లు, లేఖలు వంటి కట్టుకథల డాక్యుమెంట్లు తయారు చేసి పంపిస్తారు. అనుమానం లేకుండా ఉండేందుకు కుటుంబ ప్రతిష్టకు హాని కలుగుతుందని చెప్పి ఒత్తిడి పెంచుతారు. కేసు నుండి బయటపడాలంటే భారీ మొత్తం డబ్బు సేకరించి సుప్రీం కోర్టుకు డిపాజిట్ చేయాలి అని చెప్పి వెంటనే ట్రాన్స్ఫర్ చేయిస్తారు. కుటుంబ సభ్యులకు చెప్పొద్దని హెచ్చరిస్తూ సోషల్ ఇంజినీరింగ్ పద్ధతులను వినియోగిస్తారని హెచ్చరించారు. ఈ నేపథ్యంలో సైబర్ క్రైమ్ యూనిట్ ప్రజలకు స్పష్టమైన సూచనలు ఇస్తోంది.. డిజిటల్ అరెస్ట్ అనే దాంట్లో ఏమీ లేదు. నిజమైన పోలీసులు ఎప్పుడూ ఫోన్, లేదా వీడియో కాల్ ద్వారా అరెస్ట్ చేయరు. కాలర్ స్పూఫ్ చేయబడవచ్చు కాబట్టి ఏ అధికారిక కాల్ వచ్చినా వెంటనే నమ్మేయకూడదు. పాన్, ఆధార్, బ్యాంక్ వివరాలు వంటి వ్యక్తిగత లేదా ఆర్థిక సమాచారాన్ని ఎవరితోనూ పంచకూడదు. అనుమానం వచ్చిన వెంటనే కాల్‌ను కట్ చేసి, కాలర్ ఇచ్చిన నంబర్లకు తిరిగి కాల్ చేయకుండా, స్థానిక పోలీస్ స్టేషన్ లేదా ప్రభుత్వ అధికారిక హెల్ప్‌లైన్‌ద్వారా మాత్రమే ధృవీకరించాలి. మెసేజ్లు, స్క్రీన్‌షాట్లు, కాల్ లాగ్స్ వంటి సాక్ష్యాలను భద్రపరచడం కూడా చాలా ముఖ్యమని అధికారులు తెలిపారు. ఇలాంటి మోసాలు ఎదురైనపుడు వెంటనే నేషనల్ సైబర్ క్రైమ్ హెల్ప్‌లైన్ 1930కు కాల్ చేయాలని లేదా ఫిర్యాదు చేయాలని సూచించారు. తాజా అప్డేట్ల కోసం హైదరాబాద్ సిటీ సైబర్ క్రైమ్ అధికారిక సోషల్ మీడియా పేజీలను,ఖాతాలను ఫాలో కావాలని చెప్పారు. డిజిటల్ ప్రపంచం వేగంగా మారుతున్న కొద్దీ మోసగాళ్ల పద్ధతులు కూడా అధునాతనంగా మారుతున్నాయి. ఒక్క ఫోన్ కాల్, ఒక్క మెసేజ్ కూడా భారీ నష్టానికి దారితీసే ప్రమాదం ఉందన్నారు.

## తెలంగాణలో రాజకీయ కోలాహలం

హైదరాబాద్,నవంబరు29 (జై భీమ్ న్యూస్):తెలంగాణలో స్థానిక సంస్థల ఎన్నికల కోలాహలం కొనసాగుతోంది. రాష్ట్రంలో తొలి విడత పంచాయతీ ఎన్నికలకు సంబంధించిన నామినేషన్ల స్వీకరణ ప్రక్రియ గురువారం ప్రారంభమైన విషయం తెలిసిందే. శనివారంతో మొదటి విడత పంచాయతీ ఎన్నికల నామినేషన్ల గడువు ముగిసింది. తొలి రోజే సర్పంచ్, వార్డు సభ్యుల పదవులకు అభ్యర్థుల నుంచి భారీ స్పందన లభించింది. రాష్ట్రవ్యాప్తంగా తొలిరోజు సర్పంచి పదవుల కోసం 3,242 నామినేషన్లు, వార్డు సభ్యుల స్థానాలకు 1,821 నామినేషన్లు దాఖలైనట్లు ఎన్నికల అధికారులు వెల్లడించారు. రెండో రోజు సర్పంచ్ స్థానాలకు 4901 నామినేషన్లు దాఖలు. రెండో రోజు వార్డు మెంబర్ల స్థానాలకు 9643 నామినేషన్లు దాఖలు అయినట్లు తెలిపారు. రెండు రోజుల్లో సర్పంచ్ స్థానాలకు 8198 నామినేషన్లు, 11502 వార్డు మెంబర్ నామినేషన్లు దాఖలు అయినట్లు వెల్లడించారు. మొదటి విడతలో 189 మండలాల్లోని 4,236 సర్పంచ్ స్థానాలకు, 37,440 వార్డు సభ్యుల స్థానాలకు ఎన్నికల కమిషన్ ఎన్నికలు నిర్వహించనున్నది. 30వ తేదీన నామినేషన్ పత్రాల పరిశీలన చేపడతారు. డిసెంబర్ 3 వరకు నామినేషన్ల ఉపసంహరణకు గడువు విధించారు. అదే రోజు పోటీలో ఉన్న తుది అభ్యర్థుల జాబితాను ప్రకటిస్తారు. డిసెంబర్ 11న ఉదయం 7 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు పోలింగ్ నిర్వహించనున్నారు. పోలింగ్ ముగిసిన వెంటనే, అదే రోజు మధ్యాహ్నం ఓట్ల లెక్కింపు చేపట్టి వార్డు సభ్యులు, సర్పంచుల ఫలితాలను వెల్లడిస్తారు.

# కాట్రపల్లి గ్రామాన్ని ఆదర్శ గ్రామంగా తీర్చిదిద్దుతానన్న సంకల్పం

**సర్పంచ్ అభ్యర్థి గడ్డం నాగార్జున నామినేషన్ దాఖలు**



**మహబూబాబాద్ జిల్లా, నవంబర్ 29 (జై భీమ్ న్యూస్)**

కేసముద్రం మండలం కాట్రపల్లి గ్రామాభివృద్ధిని ప్రధాన లక్ష్యంగా పెట్టుకున్న సర్పంచ్ అభ్యర్థి గడ్డం నాగార్జున శనివారం గ్రామ పంచాయతి ఆవరణలో తన నామినేషన్‌ను ఘనంగా దాఖలు చేశారు. ఈ కార్యక్రమానికి గ్రామ ప్రజలు, యువత, మహిళలు, పెద్దలు పెద్ద ఎత్తున హాజరై తమ మద్దతును తెలియజేశారు. నామినేషన్ అనంతరం ప్రజలను ఉద్దేశించి గడ్డం నాగార్జున మాట్లాడారు. తాను గత 20 సంవత్సరాలుగా విద్యార్థి ఉద్యమాలలో చురుకుగా పాల్గొని గ్రామ సమస్యలు, ప్రజల బాధలు దగ్గరగా చూసిన వ్యక్తినని తెలిపారు. ఎన్ని ప్రభుత్వాలు మారినా మా కాట్రపల్లి అభివృద్ధి మార్గంలో ముందడుగు వేయలేదు. మంచి రోజులు రావాలంటే రాజకీయంగా ముందుకు రావాలనే నిర్ణయం తీసుకున్నాను. కాట్రపల్లి అభివృద్ధి కోసం మీ ఒక ఓటు నా జీవిత ధ్యేయం అని ఆయన భావోద్వేగంగా పేర్కొన్నారు. విద్యార్థి నాయకత్వంతో ప్రారంభమైన తన సేవలు తెలంగాణ ఉద్యమంలో కీలక పాత్ర పోషించాయని, కాకతీయ యూనివర్సిటీని కేంద్రంగా తీసుకుని అనేక ఆందోళనలు నడిపి, జైలు శిక్షలు, కేసులను భరించి, ప్రత్యేక తెలంగాణ కోసం పోరాడిన రోజుల్ని నాగార్జున గుర్తుచేశారు. ప్రజల కోసం పోరాడడం నా రక్తంలో ఉంది. అందుకే ఈసారి నా గ్రామం కోసం నిజమైన మార్పు తేవాలనుకుంటున్నాను అని అన్నారు. ప్రస్తుతం అఖిల భారత ప్రజాతంత్ర విద్యార్థి సమాఖ్య (ఎఐడిఎస్ఓ) తెలంగాణ రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా పనిచేస్తున్నట్లు చెప్పారు. కాట్రపల్లి గ్రామం ఎదుర్కొంటున్న సమస్యలను ప్రస్తావిస్తూ ం రోడ్లు, కాలువలు, తాగునీటి లాంటి మౌలిక వసతులు అందుబాటులో లేవు. రైతులకు సరైన వ్యవసాయ సహాయం లేదు. యువతలో నిరుద్యోగం తీవ్రంగా పెరిగింది. పేద ప్రజలు ఆర్థిక%-%సామాజికంగా వెనుకబడి పోయారు. చదువుకున్న యువత ఉద్యోగాల కోసం గ్రామం విడిచి వెళ్లాల్సిన పరిస్థితి ఏర్పడింది. ఇది మారాలి%ా% తప్పకుండా మారాలి అని అన్నారు. సర్పంచ్‌గా ఎన్నికైతే అమలు చేయబోయే ప్రణాళికలను వివరించిన ఆయన, కాట్రపల్లిని ఆదర్శ గ్రామంగా తీర్చిదిద్దడమే ప్రాథమిక లక్ష్యమని చెప్పారు. శుభ్రత, పచ్చదనం, ప్రతి కుటుంబానికి సేవలు అందే అభివృద్ధి ప్రణాళికలను అమలు చేస్తానని హామీ ఇచ్చారు. అన్ని కాలువల పునరుద్ధరణ, గ్రామ రహదారుల మరమ్మతులు %-% పొడిగింపు, నిరంతర తాగునీటి సరఫరా, విద్యుత్ సమస్యల పరిష్కారం వంటి మౌలిక వసతుల బలోపేతంపై ప్రత్యేక దృష్టి సారిస్తానని వెల్లడించారు. యువతకు ఉద్యోగ అవకాశాలు కల్పించేందుకు నైపుణ్యాల అభివృద్ధి కేంద్రాలు, ప్రభుత్వ పథకాలపై అవగాహన కార్యక్రమాలు, క్రీడలు%-%విద్య అభివృద్ధికి మద్దతు అందిస్తానని తెలిపారు. రైతుల సమస్యలను పరిష్కరించి వ్యవసాయానికి అవసరమైన బోర్లు, కాలువలు, ఎరువులు, విత్తనాల విషయంలో పూర్తి సహాయాన్ని అందిస్తానని చెప్పారు. మహిళల సాధికారత కోసం మహిళా సంఘాల బలోపేతం, స్వయం ఉపాధి అవకాశాలు, ఆరోగ్య సేవల విస్తరణపై పని చేస్తానని వాగ్దానం చేశారు. ఒక్క అవకాశం ఇవ్వండి%ా% కాట్రపల్లి ఎలా మారుతుందో నేను చేసి చూపిస్తా. మీ ప్రతి సమస్యకు పరిష్కారం చూపే పాలనను అందిస్తా. మనం అందరం కలిసి కాట్రపల్లిని నిజమైన ఆదర్శ గ్రామంగా మారుద్దాం అని నాగార్జున గ్రామ ప్రజలకు హామీ ఇచ్చారు. నామినేషన్ కార్యక్రమం మొత్తం ఉత్సాహభరితంగా సాగింది. గ్రామ ప్రజలు, ముఖ్యంగా యువత పెద్ద ఎత్తున హాజరై నాగార్జునకు తమ మద్దతు తెలిపారు. మా గ్రామానికి మార్పు తీసుకురాగల నాయకుడు నాగార్జునే అని స్థానికులు అభిప్రాయం వ్యక్తం చేయడం కార్యక్రమానికి ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది.

## ఎంఈఓ - ఉపాధ్యాయుల అధికార దుర్వినియోగంపై ఆర్‌జెడీకి ఫిర్యాదు

**విద్యార్థుల భవిష్యత్తుతో చెలగాటమంటూ ఆల్ ఇండియా స్టూడెంట్స్ బ్లాక్ ఆగ్రహం**

**హైద్రాబాద్, నవంబర్ 29 (జై భీమ్ న్యూస్)**

వరంగల్ మండల విద్యాధికారి (ఎంఈఓ) కార్యాలయంలో ప్రభుత్వ ఉపాధ్యాయుడిని బోధనేతర పనులకు వినియోగించడం ద్వారా విద్యార్థుల హక్కులను ఉల్లంఘిస్తున్నారని ఆరోపిస్తూ, ఆల్ ఇండియా స్టూడెంట్స్ బ్లాక్ తెలంగాణ రాష్ట్ర కన్వీనింగ్ కమిటీ సభ్యుడు కొలుగూరి సూర్యకిరణ్ వరంగల్ ప్రాంతీయ సంయుక్త సంచాలకుడు (ఆర్‌జెడీ) కె. సత్యనారాయణ రెడ్డికి వినతి పత్రం సమర్పించారు. ఈ సందర్భంగా సూర్యకిరణ్ మాట్లాడుతూ, పాఠశాలలో గణితశాస్త్ర ఉపాధ్యాయుడిగా పనిచేయాల్సిన గోపాల్ రెడ్డిని డిప్యూటేషన్ పేరిట ఎంఈఓ కార్యాలయంలో పని చేయిస్తూ విద్యార్థులకు తీవ్ర అన్యాయం జరుగుతోందన్నారు. తన కార్యాలయ అవసరాల కోసం ఉపాధ్యాయుడిని తరలించుకోవడం పూర్తిగా ప్రభుత్వ నిబంధనలకు వ్యతిరేకమని, ఇది అధికార దుర్వినియోగానికి నిదర్శనమని మండిపడ్డారు. బోధన బాధ్యతలను విస్మరించిన ఉపాధ్యాయుడు అన్యాయంగా జీతభత్యాలు పొందడం చాలా పెద్ద తప్పు. ఇదంతా తెలిసి కూడా కాంప్లెక్స్ హెడ్‌మాస్టర్ జీత బిల్లులు చేయడం ఎంతవరకు సమంజసం? పాఠశాలకు రాని ఉపాధ్యాయుడి కారణంగా విద్యార్థుల భవిష్యత్తు నష్టపోతోంది. ఇది క్షమించలేని చర్య అని వ్యాఖ్యానించారు. ఎంఈఓతో కుమ్మక్కై ఉపాధ్యాయుడు విధులను విస్మరించడం, బోధనేతర పనులు చేయడం 'రాజద్రోహం' లాంటి చర్యేనని సూర్యకిరణ్ తీవ్ర స్థాయిలో విమర్శించారు. ఈ విషయాన్ని వెంటనే పరిష్కరించాలని, ఎంఈఓ, ఉపాధ్యాయుడు గోపాల్ రెడ్డిని సస్పెండ్ చేసి తగిన శిక్షలు విధించాలని ఆర్‌జెడీకి డిమాండ్ చేశారు. సమర్పించిన ఫిర్యాదుపై స్పందించిన ఆర్‌జెడీ కె. సత్యనారాయణ రెడ్డి పూర్తి స్థాయి విచారణ జరిపి తగిన చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. ఇద్దరిపై చర్యలు తీసుకునేంత వరకు ఎంత దూరమైనా పోరాడతాను. అవసరమైతే ఈ విషయాన్ని ప్రభుత్వ దృష్టికి కూడా తీసుకువెళ్తాను అని కొలుగూరి సూర్యకిరణ్ స్పష్టం చేశారు.



## గ్రామ పంచాయతీ ఎన్నికల నిర్వహణలో రిటర్నింగ్ అధికారుల పాత్ర కీలకం

**జిల్లా అదనపు కలెక్టర్ స్థానిక సంస్థలు సంపత్ రావు.**






**ములుగు, నవంబర్ 29(జై భీమ్ న్యూస్)**

గ్రామ పంచాయతీ ఎన్నికల నిర్వహణలో రిటర్నింగ్ అధికారుల పాత్ర కీలకమని జిల్లా అదనపు కలెక్టర్ స్థానిక సంస్థలు సంపత్ రావు అన్నారు. శనివారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో అదనపు కలెక్టర్ స్థానిక సంస్థలు సంపత్ రావు గ్రామ పంచాయతీ ఎన్నికల నిర్వహణ కొరకు రిటర్నింగ్, సహాయ రిటర్నింగ్ అధికారులకు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ రిటర్నింగ్ అధికారులు ఎలాంటి నిర్లక్ష్యం జరగకుండా కార్యదీక్షతో విధులు నిర్వర్తించాలని తెలిపారు. ప్రతి విషయంలో అత్యంత జాగ్రత్త పాటించాలన్నారు. ఈ సందర్భంగా రిటర్నింగ్ అధికారులు నిర్వర్తించాల్సిన విధులు బాధ్యతలపై పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివరించి రిటర్నింగ్ అధికారులు ఉన్న సందేహాలను నివృత్తి చేశారు. ప్రతి మండలంలోని గ్రామ పంచాయతీ లను క్లస్టర్లను ఏర్పాటు చేసి ఒక రిటర్నింగ్ అధికారినీ, సహాయ రిటర్నింగ్ అధికారిని నియమించామని తెలిపారు. రాష్ట్రఎన్నికల సంఘం సూచించిన మార్గదర్శకత్వా లు రిటర్నింగ్ అధికారుల కర దీపికలో సవివరంగా ఉన్నాయని, వాటిని క్షుణ్ణంగా అవగాహన చేసుకొని దానికనుగుణంగా విధులు నిర్వర్తించాలని అన్నారు. రిటర్నింగ్ అధికారులు ఎన్నికల నిర్వహణ నియమావళి ప్రకారం ఎన్నికల నోటీసు ఇవ్వాలని, నామినేషన్ల పేపర్ల స్వీకరణ, రిటర్నింగ్ అధికారి కార్యాలయం నోటీసు బోర్డు పై స్వీకరించిన అభ్యర్థుల నామినేషన్ పత్రాల జాబితా, స్వీయ ప్రకటన ప్రతులను ప్రచురించాలని, నామినేషన్ పత్రాల పరిశీలన, ఏదేని నామినేషన్ పత్రాన్ని తిరస్కరించినచో దానికి గల కారణం తెలపాలని, నామినేషన్ పత్రాల జాబితా ప్రచురించాలని, అభ్యర్థుల ఉపసంహరణ నోటీసు స్వీకరించాలని, పోటీ చేయు జాబితా, గుర్తులు కేటాయింపు, ప్రతిరోజు పర్యవేక్షించాలని, ఎన్నికల నోటిఫికేషన్ వెలుబడినప్పటి నుండి ఫలితాలు ప్రకటించే వరకు ఎన్నికల ప్రవర్తనా నియమావళి అమలులో ఉంటుందని అన్నారు. ఏరోజుకారోజు టి పోల్ సాఫ్ట్వేర్ లో ఆర్‌ఓలు నివేదికలను ఎలక్షన్ ప్రాసెస్ మాడల్ ను ఉంచాలన్నారు. ఈ శిక్షణ కార్యక్రమం లో రిటర్నింగ్, సహాయ రిటర్నింగ్ అధికారులు, మాస్టర్ ట్రైన్లు తదితరులు పాల్గొన్నారు.

## కుల దురహంకార హత్యలపై ప్రభుత్వం కఠిన చర్యలు తీసుకోవాలి

**కెవిపిఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి మంద సంపత్**



**హన్మకొండ, 29 నవంబర్ (జై భీమ్ న్యూస్)**

రాష్ట్రంలో కొనసాగుతున్న వరుస కుల దురహంకార క్రూర హత్యలపై ప్రభుత్వం కఠినంగా వ్యవహరించాలని, కులాంతర వివాహితులకు ప్రత్యేక రక్షణ చట్టం రూపొందించాలని కెవిపిఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి మంద సంపత్ డిమాండ్ చేశారు. శనివారం వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డికి ప్రతినిధి బృందం వినతిపత్రం అందజేసిన అనంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూ రాష్ట్రంలో కుల దురహంకార హత్యలు రోజు రోజుకు పెరుగుతున్నప్పటికీ ప్రభుత్వం మరియు పోలీసులు కేవలం ప్రేక్షకుల్లా చూస్తున్నారని తీవ్రమైన ఆక్షేపణలు వ్యక్తం చేశారు. ఆసిఫాబాద్ జిల్లాలో నిండు గర్భవతి, పసికందును నిర్దాక్షిణ్యంగా హత్య చేసిన ఘటన, రంగారెడ్డి జిల్లా ఎల్లంపల్లిలో దళిత యువకుడు ఎర్ర రాజశేఖర్‌ను కిడ్నాప్ చేసి సజీవదహనం చేసిన సంఘటనలు రాష్ట్రాన్ని కుదిపేశాయని అన్నారు. ఇప్పటి వరకు రాష్ట్రంలో 142 కుల దురహంకార హత్యలు నమోదయ్యాయని, ఇవి తగ్గడం కాక పెరుగుతూనే ఉన్నాయని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. జస్టిస్ పున్నయ్య సిఫారసుల ప్రకారం ప్రతి గ్రామంలో నెల చివరి రోజున ప్రభుత్వ అధికారులు గ్రీవెన్స్ డే నిర్వహించి, సహపంక్తి భోజనాలు, కులరహిత అవగాహన సదస్సులు ఏర్పాటు చేయాలని సూచించారు. కుల దురహంకారాలకు పాల్పడిన వారికి కఠిన శిక్షలు విధించడంతో పాటు, కులాంతర వివాహితులకు ప్రత్యేక రక్షణ చట్టం చేయాలని, వారికి తక్షణ ప్రోత్సాహకాలు అందించాలని, జంటలో ఒకరికి ప్రభుత్వ ఉద్యోగం అందించి, ఇల్లు కట్టిపెట్టే విధానాన్ని అమలు చేయాలని వినతిపత్రంలో కోరారు. వినతిపత్రాన్ని స్వీకరించిన ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి ఈ సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో కెవిపిఎస్ జిల్లా అధ్యక్షులు ఓరుగంటి సాంబయ్య, ఉపాధ్యక్షులు దూడపాక రాజేందర్, రాకేష్ తదితరులు పాల్గొన్నారు.

## ఎయిర్‌బస్ సాఫ్ట్‌వేర్ సమస్య.. భారత్‌లో 338 విమానాలపై ప్రభావం: డీజీసీఏ

ఎయిర్‌బస్ A320 విమానాల్లో తలెత్తిన అంతర్జాతీయ సాఫ్ట్‌వేర్ సమస్య భారత విమానయాన రంగంపై కూడా ప్రభావం చూపింది. ఈ సమస్య కారణంగా దేశవ్యాప్తంగా మొత్తం 338 విమాన సర్వీసులు ప్రభావితమైనట్లు డైరెక్టరేట్ జనరల్ ఆఫ్ సివిల్ ఏవియేషన్ (డీజీసీఏ) వెల్లడించింది. అయితే, ప్రయాణికులకు ఊరటనిచ్చే విషయమేమిటంటే వీటిలో ఇప్పటికే 270 విమానాల్లో అవసరమైన సాఫ్ట్‌వేర్ అప్‌డేట్‌ను పూర్తి చేసినట్లు డీజీసీఏ స్పష్టం చేసింది. యూరోపియన్ యూనియన్ ఏవియేషన్ సేఫ్టీ ఏజెన్సీ (EASA) ఆదేశాల మేరకు ప్రపంచవ్యాప్తంగా ఎయిర్‌బస్ A320 విమానాల్లో సాఫ్ట్‌వేర్ అప్‌గ్రేడ్ తప్పనిసరి చేశారు. విమాన ఫ్లైట్ కంట్రోల్ సిస్టమ్‌లో కీలకమైన 'ఎలివేటర్ అండ్ ఐలరాన్ కంప్యూటర్' (ELAC) యూనిట్‌లో లోపం తలెత్తడంతో ఈ నిర్ణయం తీసుకున్నారు. ఈ ఆదేశాలతో ప్రపంచవ్యాప్తంగా దాదాపు 6,000 విమానాలపై ప్రభావం పడింది.

## నారాయణ ప్రీమియర్ లీగ్ సందడితో మార్మోగిన వరంగల్ నారాయణ స్కూల్

**కిడ్స్, చాంప్స్ పోటీల్లో విద్యార్థుల ప్రతిభ పతాకస్థాయికి**






**వరంగల్, నవంబర్ 29 (జై భీమ్ న్యూస్)**

గ్రేటర్ వరంగల్‌లోని నారాయణ పాఠశాలలో నిర్వహించిన నారాయణ ప్రీమియర్ లీగ్ (ఎన్.పి.ఎల్) పోటీలు శనివారం వేడుక వాతావరణంలో సాగాయి. ఇందులో ప్రత్యేకంగా కిడ్స్, చాంప్స్ విభాగాల విద్యార్థుల కోసం నిర్వహించిన క్రీడా పోటీలు పాఠశాల ప్రాంగణాన్ని విద్యార్థుల ఉత్సాహం, క్రీడాస్ఫూర్తితో కళకళలాడేలా చేశాయి. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన వరంగల్ జోనల్ డి.జి.ఎం రిజ్వానా ఇమ్రాన్, పాఠశాల ప్రిన్సిపాల్ వంగాల అలేఖ్యలు విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడుతూ ం నేటి పిల్లల్లో శారీరక, మానసిక అభివృద్ధికి క్రీడలు ఎంతో కీలకమైనవి. ఆటలు జట్టుకృషి, క్రమశిక్షణ, నాయకత్వ లక్షణాలు, సమస్యలను ఎదుర్కొనే సామర్థ్యాన్ని పెంచుతాయి. పిల్లల్లో ఒత్తిడి తగ్గించడం, మానసిక చురుకుదనం పెంపొందించడం, సామాజిక అవగాహన అభివృద్ధి చేయడంలో క్రీడల పాత్ర ఎంతో విశేషం అని పేర్కొన్నారు. ఆమె పాల్గొన్న విద్యార్థులను ప్రోత్సహిస్తూ, ప్రతిభ కనబరిచిన విజేతలకు పతకాలు, బహుమతులు అందజేశారు. విద్యార్థుల తల్లిదండ్రులు కూడా కార్యక్రమానికి హాజరై పిల్లలను అభినందించారు. పాఠశాలలోని ఉపాధ్యాయులు, నిర్వాహకులు ఈ పోటీలను విజయవంతంగా నిర్వహించడానికి ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. వివిధ వయో వర్గాలకు అనుగుణంగా బంతి ఎగరేసే ఆటలు, పరిగెత్తులు, రిలే, ఫిట్‌నెస్ ఛాలెంజ్‌లు, టీమ్ గేమ్స్ వంటి పలు విభాగాల్లో పోటీలు జరిగాయి. ఈ కార్యక్రమంలో జోనల్ కోఆర్డినేటర్ ఆకుల సాయి కృష్ణ, శ్యామల, శిరీష, వైస్ ప్రిన్సిపల్స్ అనూష, కరుణశ్రీ, అకడమిక్ డీన్ రాజశేఖర్, ఏఓ ఆదిల్, పీఈటీ బాలకృష్ణ తదితరులు పాల్గొని విద్యార్థులను ప్రోత్సహించారు.

# ధాన్యం కొనుగోలు కేంద్రాలపై ఆకస్మిక తనిఖీలు





**వెంటనే ట్యాబ్ ఎంట్రీలు చేయాలని కలెక్టర్ స్నేహ శబరీష్ ఆదేశం**

**వేలేరు మండలంలోని మల్లికుదుర్ల, వేలేరు కేంద్రాలను తనిఖీ**

**పాఠశాలలు, అంగన్‌వాడి కేంద్రాలు..**

**తహసిల్దార్ కార్యాలయాన్ని కూడా పరిశీలించిన కలెక్టర్**

**హన్మకొండ, నవంబర్ 29(జై భీమ్ న్యూస్)**

హనుమకొండ జిల్లా కలెక్టర్ స్నేహ శబరీష్ శనివారం వేలేరు మండలంలోని మల్లికుదుర్ల, వేలేరు గ్రామాల్లో ఐకెపి ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఆకస్మికంగా పరిశీలించారు. రైతుల నుండి ధాన్యం కొనుగోలు చేసే వెంటనే వారి వివరాలను ట్యాబ్‌లో తక్షణం నమోదు చేయాలని నిర్వాహకులకు ఆదేశించారు.

**ధాన్యం కొనుగోలు వివరాలు వెంటనే నమోదు చేయండి.. కలెక్టర్ ఆదేశం**

తనిఖీ సందర్భంగా కలెక్టర్ కొనుగోలు కేంద్రాల వద్ద ఉన్న రికార్డులను పరిశీలించారు. ఇప్పటివరకు ఎంతమంది రైతుల నుండి ధాన్యం కొనుగోలు చేశారో, ట్యాబ్ ఎంట్రీలు ఎందుకు ఆలస్యమవుతున్నాయో నిర్వాహకులను ప్రశ్నించారు. గన్నీ సంచుల లభ్యత, ధాన్యం తరలింపు సన్నద్ధతపై కూడా వివరాలు తీసుకు న్నారు. రైతులతో మాట్లాడిన కలెక్టర్ వారికి ఎలాంటి ఇబ్బందులు ఉన్నాయా అని అడిగి తెలుసుకున్నారు. రికార్డుల నిర్వహణలో జాగ్రత్తలు పాటించాలని, ధాన్యం కాంటా పూర్తిచేశాక వెంటనే మిల్లులకు తరలించేందుకు చర్యలు తీసుకోవాలని సూచించారు. కలెక్టర్ స్నేహ శబరీష్ మాట్లాడుతూ రైతు విక్రయ వివరాలు అదే రోజున ట్యాబ్‌లో నమోదు చేయాలి. చెల్లింపులు 48 గంటల్లోనే పూర్తయ్యేలా చూడాలి. గన్నీ సంచులను సురక్షితంగా భద్రపరచాలి, అని ఆదేశించారు.

**పాఠశాలల పరిశీలన – ఆంగ్ల భాషపై దృష్టి పెట్టాలని సూచన..**

తర్వాత కలెక్టర్ వేలేరు ప్రాథమిక పాఠశాల, జడ్పీ ఉన్నత పాఠశాలలను సందర్శించారు. 3వ తరగతి, 6వ మరియు 7వ తరగతి గదులను సందర్శించి విద్యార్థులతో మాట్లాడారు.

ఆంగ్ల బోధన సాగుతుందా? పాఠ్యాంశాలు అర్థమవుతున్నాయా? అనే విషయాలను విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. మిడ్టెన్ పరీక్షా పత్రాలను పరిశీలించిన కలెక్టర్, విద్యార్థులను ఆంగ్ల పదాలు, రైమ్స్ గురించి అడిగారు. ఉపాధ్యాయులతో ఇంగ్లీష్ ఎన్రిచ్‌మెంట్ ప్రోగ్రాం అమలు గురించి మాట్లాడారు. కలెక్టర్ సందేశం – విద్యార్థులు భవిష్యత్తులో పోటీ ప్రపంచంలో ముందుకు రావాలంటే ఆంగ్ల భాష తప్పనిసరిగా నేర్చుకోవాలి," అని సూచించారు. ఆస్పత్రి పక్కనే ఉన్న అంగన్‌వాడి కేంద్రాన్ని కూడా పరిశీలించి పిల్లల సంఖ్య, అందిస్తున్న పౌష్టికాహారం గురించి అడిగి తెలుసుకున్నారు.

**తహసిల్దార్ కార్యాలయంలో దరఖాస్తుల పరిశీలన**

వేలేరు తహసిల్దార్ కార్యాలయాన్ని సందర్శించిన కలెక్టర్ సాదా బైనామా, భూభారతి, పీఓటీ, రెవెన్యూ సదస్సు దరఖాస్తులు తదితర ఫైళ్లను పరిశీలించారు. దరఖాస్తుల పరిష్కారం మరింత వేగం అందుకోవాలని తహసిల్దార్ కోమికి సూచించారు. ఈ సందర్భనలో డీఆర్‌డీఓ మేనేజర్ శ్రీను, సివిల్ సప్లై కార్పొరేషన్ మేనేజర్ మహేందర్, ఎంఈఓ చంద్రమౌళి తదితర అధికారులు పాల్గొన్నారు.

## వరంగల్‌లో భద్రకాళి అమ్మవారిని దర్శించిన కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి





**వరంగల్, నవంబర్ 29(జై భీమ్ న్యూస్)**

వరంగల్ మహానగరంలోని ప్రాచీన, చారిత్రక శ్రీ భద్రకాళి దేవస్థానంలో కేంద్ర బొగ్గు గనుల శాఖ మంత్రి గంగపురం కిషన్ రెడ్డి శనివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయానికి విచ్చేసిన మంత్రికి ధర్మకర్తలు ఓరుగంటి పూర్ణచందర్, మోతుకూరి మయూరి రామేశ్వర్ రావు, నార్ల సుగుణ, జారతి వెంకటేశ్వర్లు, బింగి సతీశ్, అనంతుల శ్రీనివాస్, ముగ శ్రీనివాస్ రావు, తోనుపునూరి వీరన్న, అలాగే కార్యనిర్వాహణాధికారి రామల సునీత, శ్రీ భద్రకాళి శేషు, వేదపండితులు పూర్ణకుంభంతో ఘన స్వాగతం పలికారు. తరువాత గోశాలలో గోగ్రాసం పెట్టి, ఆలయంలో ఆది శంకరాచార్యులు, వల్లభ గణపతులను దర్శించిన మంత్రి అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం మహా మండపంలో అర్చకులు, వేదపండితులు మహాదాశీర్వచనం నిర్వహించి శేష వస్త్రాలు, ప్రసాదాలను అందజేశారు. ఈ సందర్భంగా ఆలయ ధర్మకర్తలు వరంగల్, కాజీపేట్ రైల్వే స్టేషన్లలో భద్రకాళి అమ్మవారి చిత్రపటాలు ఏర్పాటు చేయాలనే వినతిపత్రాన్ని కేంద్ర మంత్రికి సమర్పించారు. ఈ కార్యక్రమంలో రావు పద్మ, గంట రవికుమార్, డాక్టర్ కాళీ ప్రసాద్, ఎర్రబెల్లి ప్రదీప్ రావు, ఆరూరి రమేష్, మర్తినేని ధర్మారావు, ప్రొఫెసర్ సీతారాం నాయక్ తదితరులు పాల్గొన్నారు. అదే రోజు అమ్మవారిని దర్శించిన ప్రముఖులలో ఎన్నికల జనరల్ అబ్జర్వర్, ఐఏఎస్ అధికారి కే. శివకుమార్ నాయుడు కూడా ఉన్నారు.

## రాజులకొత్తపల్లి గ్రామంలో ప్రజాస్వామ్య ఎన్నికలకు భంగం కలిగించిన వారిపై కఠిన చర్యలు తప్పవు

**టి.ఆర్.పి రాష్ట్ర యువ నాయకుడు వరిపెల్లి అనిల్ కుమార్**

**మహబూబాబాద్, నవంబర్ 29(జై భీమ్ న్యూస్)**



మహబూబాబాద్ జిల్లా, నెల్లికుదురు ం రాబోయే సర్పంచ్ ఎన్నికలు రాజులకొత్తపల్లి గ్రామంలో పూర్తిగా ప్రజాస్వామ్యపరంగా, రాజ్యాంగబద్ధంగా, ఎటువంటి అక్రమ ప్రయత్నాలు లేకుండా జరగాలని టి.ఆర్.పి రాష్ట్ర యువ నాయకుడు వరిపెల్లి అనిల్ కుమార్ కోరారు. గ్రామాభివృద్ధి పట్ల బాధ్యతగల యువ నాయకుడిగా, ఎన్నికల సంఘం విధించిన నియమాలను ప్రతి అభ్యర్థి మరియు ప్రతి గ్రామస్థుడు ఖచ్చితంగా పాటించాలని ఆయన సూచించారు. అనిల్ కుమార్ మాట్లాడుతూ ం ఎన్నికల ప్రవర్తనా నియమావళికి విరుద్ధంగా డబ్బులు, మద్యం పంచడం వంటి అక్రమ చర్యలు ఎక్కడైనా జరిగినా, గ్రామ యువత ఆధారాలు ం ఫోటోలు, వీడియోలు ం నాకు పంపిస్తున్నారు. అలాంటి ప్రతి సాక్ష్యాన్ని నేను వ్యక్తిగతంగా ఎన్నికల సంఘానికి, అవసరమైతే సంబంధిత కోర్టులకు సమర్పిస్తాను. గ్రామంలో అక్రమాలకు తావులేకుండా పారదర్శక ఎన్నికలు జరపడం మా యువత లక్ష్యం" అని తెలిపారు. అభ్యర్థులు చట్టపరమైన విధానంలోనే ప్రచారం చేయాలని, నియమాలు ఉల్లంఘించిన పక్షంలో ఎన్నికల సంఘం చట్టం ప్రకారం కఠిన చర్యలు తీసుకుంటుందని ఆయన హెచ్చరించారు. రాజులకొత్తపల్లి గ్రామం తెలంగాణ రాష్ట్రంలో "మద్యం, డబ్బు లేకుండా స్వచ్ఛమైన ప్రజాస్వామ్య ఎన్నికలను నిర్వహించిన గ్రామంగా నిలవాలన్నది నా సంకల్పం అని అనిల్ కుమార్ వెల్లడించారు. ఈ దిశగా గ్రామ యువత, ప్రజల పూర్తి సహకారం అవసరమని ఆయన ఒక ప్రకటనలో తెలిపారు.

## తెలంగాణ ఆత్మను మేల్కొలిపిన మహనీయుడు అందెశ్రీ

**వీసీ ఆచార్య ప్రతాప్ రెడ్డి**

**కాకతీయ విశ్వవిద్యాలయంలో అందెశ్రీ యాదిలో స్మరణ సభ**





**హన్మకొండ, నవంబర్ 29 (జై భీమ్ న్యూస్)**

తెలంగాణ ఆత్మను మేల్కొలిపిన వ్యక్తి అందెశ్రీ అని కాకతీయ విశ్వవిద్యాలయం వైస్ ఛాన్సలర్ ఆచార్య కే. ప్రతాప్ రెడ్డి అభివర్ణించారు. విశ్వవిద్యాలయం సెనేట్ హాల్‌లో, విశ్రాంత అధ్యాపకులు%–%మాజీ పార్లమెంట్ సభ్యులు ఆచార్య అజ్మీరా సీతారం నాయక్ ఆధ్వర్యంలో, రాష్ట్ర గీత రచయిత, తెలంగాణ సాహిత్య సమరయోధుడు అందెశ్రీ యాదిలో నిర్వహించిన స్మరణ సభలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. సభలో విద్యార్థులు, పరిశోధకులు, బోధనా%–%బోధనేతర సిబ్బంది, విశ్రాంత ఉద్యోగులు, అతిథులను ఉద్దేశించి మాట్లాడుతూ ఆచార్య ప్రతాప్ రెడ్డి అందెశ్రీ మాట, పాట ప్రకృతికి అత్యంత దగ్గరగా ఉంటాయి. తన కవిత్వం ద్వారా తెలంగాణ ఆత్మను మేల్కొలిపిన మహనీయుడు అందెశ్రీ. ఆయన రచనలు ఎల్లప్పుడూ సజీవంగా నిలిచే సాహిత్య సంపద" అని అన్నారు. తెలంగాణ ఉద్యమంలో ఆయన గీతాలు ప్రజల్లో అపార చైతన్యం రగిలించాయని గుర్తుచేశారు. ల్యాబ్‌లో ప్రయోగం ఎంత ముఖ్యమో, పొలంలో విత్తనం అంతే ముఖ్యము. పుస్తకాలతో పాటు పల్లె ముఖాలు కూడా చదవాలి అని విద్యార్థులకు ఆయన సందేశమిచ్చారు. అందెశ్రీ ప్రత్యేకమైన వ్యక్తిత్వం కలిగిన రచయితని, ఆయన రచనలు సమకాలీన మానవ సంక్షోభాలకు అద్దంపట్టాయని తెలిపారు. ఈ నెల బొమ్మెర పోతన, కాళోజి, నేరెళ్ల వేణుమాధవ్ వంటి మహనీయులను స్మరించుకునే విశిష్టమైన సందర్భంగా పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో విశ్రాంత ఆచార్యులు కే. వెంకటనారాయణ, బి. సురేష్ లాల్, డా. వి.ఎస్. రెడ్డి, డా. ఎం. లింగయ్య, డా. చిర్రా రాజు, డా. చారి, డా. ముచ్చెర్ల పృథ్వీ రాజు, రచయితలు పొట్లపల్లి శ్రీనివాస్, జయరాజ్, అలాగే అందెశ్రీ కుటుంబ సభ్యులు పాల్గొన్నారు. సభ ప్రారంభంలో అందెశ్రీ చిత్రపటానికి పూలమాలలు వేసి, ఒక నిమిషం మౌనం పాటిస్తూ నివాళు లు అర్పించారు.



## జిల్లా స్థాయి పీఎం శ్రీ పాఠశాలల క్రీడల మహోత్సవం ముగింపులో జిల్లా విద్యాశాఖ అధికారి ఏ. వెంకట్ రెడ్డి

**జవహర్లాల్ నెహ్రూ స్టేడియంలో ఉత్సాహభరితంగా సెమీఫైనల్, ఫైనల్ పోటీలు**





**హన్మకొండ, నవంబర్ 29 (జై భీమ్ న్యూస్)**

జిల్లా స్థాయి పీఎం శ్రీ పాఠశాలల క్రీడల పోటీలు శనివారం ఉత్సాహభరిత వాతావరణంలో ఘనంగా ముగిశాయి. జవహర్లాల్ నెహ్రూ స్టేడియంలో జరిగిన ఈ క్రీడా మహోత్సవంలో కబడ్డీ, ఖో–ఖో, వాలీబాల్ విభాగాల్లో సెమీఫైనల్ మరియు ఫైనల్ పోటీలు ఉత్కంఠభరితంగా సాగాయి. ప్రతిభ కనబరిచిన విద్యార్థులను రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక చేశారు. జిల్లా విద్యాశాఖ అధికారి ఏ. వెంకట్ రెడ్డి స్టేడియాన్ని సందర్శించి, వివిధ విభాగాల పోటీలను పరిశీలించారు. విద్యార్థుల ప్రతిభను అభినందిస్తూ, శారీరక దృఢత్వం, జట్టు సమన్వయం, నాయకత్వ నైపుణ్యాల వికాసానికి ఇలాంటి పోటీలు ఎంతో దోహదం చేస్తాయని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ప్లానింగ్ కోఆర్డినేటర్ బి. మహేష్, ఎస్‌జి ఎఫ్‌ఐ సెక్రటరీ వి. ప్రశాంత్ కుమార్, ప్రాక్టీసింగ్ స్కూల్ హెడ్‌మాస్టర్ జగనాదం, పీఈటీలు పార్థసారథి, సుధాకర్, ప్రభాకర్ రెడ్డి, సుభాష్, వాసు, హరీష్, అలాగే వివిధ పాఠశాలల విద్యార్థులు, విద్యార్థినులు, ప్రధానోపాధ్యాయులు పాల్గొన్నారు. జిల్లా స్థాయిలో ప్రతిభ చాటుకున్న విద్యార్థులు రాష్ట్రస్థాయిలో కూడా మెరిసి మరింత ఉన్నత ఫలితాలు సాధించాలని అధికారులు ఆశాభావం వ్యక్తం చేశారు.

## రెండవ విడత నామినేషన్ల స్వీకరణకు అన్ని ఏర్పాట్లు పూర్తి - కలెక్టర్ డాక్టర్ సత్య శారద

**వరంగల్, 29 నవంబర్ (జై భీమ్ న్యూస్)**

జిల్లాలో గ్రామ పంచాయతీ రెండవ విడత నామినేషన్ల స్వీకరణ కోసం అవసరమైన అన్ని ఏర్పాట్లు పూర్తి చేశామని జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద శనివారం తెలిపారు. ఇప్పటికే మొదటి విడతలో వరంగల్ రెవెన్యూ డివిజన్ లోని మూడు మండలాల్లోని 91 గ్రామ పంచాయతీలు, 800 వార్డ్ సభ్యుల నామినేషన్ల స్వీకరణ ప్రక్రియను ఎన్నికల షెడ్యూల్ ను అనుసరిస్తూ శనివారం సాయంత్రం నాటితో సజావుగా పూర్తి చేయడం జరిగిందని అన్నారు. ఈ నెల 30 నుండి డిసెంబర్ 02వ తేదీ వరకు రెండవ విడతలో నర్సంపేట రెవెన్యూ డివిజన్ లోని దుగ్గొండి, నల్లబెల్లి మండలాల్లో, వరంగల్ రెవెన్యూ డివిజన్ లోని సంగె%శీ%, గీసుగొండ మండలాల పరిధిలోని 117 సర్పంచ్ స్థానాలకు, 1008 వార్డు స్థానాలకు నామినేషన్లు స్వీకరించడం జరుగుతుందన్నారు. ఉదయం 10.30 గంటల నుండి సాయంత్రం 5.00 గంటల వరకు నామినేషన్ల స్వీకరణ కేంద్రాలలో నామపత్రాలు దాఖలు చేయవచ్చుని, డిసెంబర్ 02 చివరి తేదీ అని కలెక్టర్ సూచించారు. అన్ని కేంద్రాలలో హెల్ప్ డెస్క్ లు అందుబాటులో ఉంచామని అన్నారు. ఎన్నికల నియమావళిని విధిగా పాటిస్తూ, ప్రశాంత వాతావరణంలో సజావుగా ఎన్నికలు నిర్వహించేందుకు అన్ని వర్గాల వారు జిల్లా యంత్రాంగానికి సహకరించాలని కలెక్టర్ డాక్టర్ సత్య శారద కోరారు.



# వరంగల్ నగర అభివృద్ధికి కేంద్ర ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ

## నామినేషన్ల స్వీకరణ కేంద్రాలను సందర్శించిన ఎన్నికల పరిశీలకులు శివకుమార్ నాయుడు



**హన్మకొండ, నవంబర్ 29(జై భీమ్ న్యూస్)**

గ్రామపంచాయతీ ఎన్నికలకు సంబంధించి మొదటి విడతలో ఎల్కతుర్తి, భీమదేవరపల్లి మండలాల్లోని నామినేషన్ల స్వీకరణ కేంద్రాలను జిల్లా సాధారణ ఎన్నికల పరిశీలకులు కె.శివకుమార్ నాయుడు శనివారం సందర్శించారు. ఎల్కతుర్తి క్లస్టర్ గ్రామపంచాయతీ కార్యాలయంలో ఎల్కతుర్తి, ఆరెపల్లి, బావుపేట గ్రామాలకు సంబంధించి సర్పంచ్, వార్డు స్థానాలకు రిటర్నింగ్ అధికారులు, అసిస్టెంట్ రిటర్నింగ్ అధికారులు అభ్యర్థుల నుండి నామినేషన్లు స్వీకరిస్తుండగా ఎన్నికల పరిశీలకులు శివకుమార్ నాయుడు పరిశీలించారు. నామినేషన్ల స్వీకరణ కేంద్రం వద్ద ఏర్పాట్లను, హెల్ప్ డెస్క్ ను పరిశీలించారు. అనంతరం ఎంపీడీఓ కార్యాలయంలో నామినేషన్ల సామగ్రిని పరిశీలించారు. భీమదేవరపల్లి మండలంలో ములుకనూరు క్లస్టర్ గ్రామపంచాయతీ కార్యాలయంలో ములుకనూరు, కొత్తపల్లి, సాయి నగర్ గ్రామాల సర్పంచ్, వార్డు స్థానాల నామినేషన్ల ప్రక్రియ, భీమదేవరపల్లి క్లస్టర్ గ్రామపంచాయతీ కార్యాలయం పరిధిలో భీమదేవరపల్లి, విశ్వనాథ కాలనీ, కొప్పూరు గ్రామాల సర్పంచ్ వార్డు స్థానాల నామినేషన్ల ప్రక్రియను, నామినేషన్ స్వీకరణ కేంద్రాలలో చేసిన ఏర్పాట్లను ఎన్నికల పరిశీలకులు పరిశీలించి వివరాలు అడిగి తెలుసుకున్నారు. భీమదేవరపల్లిలోని ఎంపీడీఓ కార్యాలయాన్ని సందర్శించి నామినేషన్ల సామగ్రిని పరిశీలించారు. మొదటి రెండు రోజుల పాటు వచ్చిన నామినేషన్ల వివరాలను ఎంపీడీవోలను జిల్లా ఎన్నికల పరిశీలకులు శివకుమార్ నాయుడు అడిగి తెలుసుకున్నారు. నామినేషన్ల స్వీకరణ కేంద్రాలలో ఏర్పాట్లపై సంతృప్తి వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఎంపీడీవోలు విజయ్ కుమార్, వీరేశం, ఇతర అధికారులు ఉన్నారు.

## జాతీయ సీనియర్ ఖో ఖో పోటీల సన్నాహకంపై రాష్ట్ర మంత్రులను కలిసి విజ్ఞప్తి చేసిన తెలంగాణ ఖో ఖో సంఘం





**హైద్రాబాద్, నవంబర్ 29(జై భీమ్ న్యూస్)**

వచ్చే ఏడాది జనవరి 10 నుండి 15 వరకు హనుమకొండ జిల్లా కాజీపేట రైల్వే స్టేడియంలో జరగనున్న జాతీయ స్థాయి సీనియర్ ఖో ఖో పోటీల నిర్వహణకు సంబంధించిన ఏర్పాట్లపై తెలంగాణ ఖో ఖో సంఘం కార్యకర్తలు రాష్ట్ర మంత్రులను మర్యాదపూర్వకంగా కలిశారు. రాష్ట్ర ఖో ఖో సంఘం అధ్యక్షుడు జంగా రాఘవరెడ్డి నేతృత్వంలోని ప్రతినిధి బృందం, హైదరాబాద్‌లో రాష్ట్ర మంత్రులు దుద్దిల్ల శ్రీధర్ బాబు, పొన్నం ప్రభాకర్, అలాగే టూరిజం డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్ పటేల్ రమేష్ రెడ్డి లను కలిసి, రాబోయే జాతీయ పోటీల విజయవంతమైన నిర్వహణ కోసం ప్రభుత్వ సహకారం అందివ్వాలని విజ్ఞప్తి చేసింది. పోటీలకు దేశవ్యాప్తంగా నుంచి జట్లు రానుండడంతో మౌలిక సదుపాయాలు, భద్రత, వసతి, మైదాన అభివృద్ధి తదితర అంశాలపై ప్రభుత్వం సమన్వయం చేస్తే పోటీలు మరింత ప్రతిష్ఠాత్మకంగా జరుగుతాయని సంఘం నేతలు వివరణ ఇచ్చారు. ఈ సందర్భంగా జరిగిన సమావేశంలో రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నాతి కృష్ణమూర్తి, సంయుక్త కార్యదర్శి తోట శ్యాం ప్రసాద్, ఆర్గనైజింగ్ సెక్రటరీ పులి కిషోర్ కుమార్, తెలంగాణ జూడో సంఘం ప్రధాన కార్యదర్శి బైరబోయిన కైలాస్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

## పోలింగ్ కేంద్రాలను పరిశీలించిన డీసీపీ రాజమహేంద్ర నాయక్

**వరంగల్, నవంబర్ 29(జై భీమ్ క్రైమ్ న్యూస్)**



రాయపర్తి మండలంలోని సన్నూరు, ఊకల్, కొత్తూరు పెరికేడు, రాగన్నగూడెం, మైలారం, రాయపర్తి, మొరిపిరాల, కాట్రపల్లి, కొండూరు, కొలనుపల్లి, కేశపురం, తిర్మలాయపల్లి గ్రామాల్లో ఉన్న పోలింగ్ కేంద్రాలను శనివారం జనగామ డీసీపీ రాజమహేంద్ర నాయక్ పరిశీలించారు. ఈ సందర్శనలో వర్ధన్నపేట ఏసీపీ అంబటి నర్సయ్య, స్థానిక సీఐలు, ఎస్ఐలు పాల్గొన్నారు. డీసీపీ రాజమహేంద్ర నాయక్ మాట్లాడుతూ, స్థానిక సంస్థల ఎన్నికలు శాంతియుతంగా, అశాంతి లేని వాతావరణంలో జరిగేలా అన్ని ఏర్పాట్లు పూర్తి చేసుకున్నామని చెప్పారు. పోలింగ్ రోజు మండలంలో ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటుచేసుకోకుండా బలమైన బందోబస్తు ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. ఎన్నికల ప్రక్రియను నిష్పాక్షికంగా, పారదర్శకంగా నిర్వహించేందుకు పోలీసులు అప్రమత్తంగా వ్యవహరించాలని అధికారులకు సూచించారు.





### కేంద్ర బొగ్గు, గనుల శాఖ మంత్రి జీ. కిషన్ రెడ్డి
### వరంగల్ రైల్వే స్టేషన్ ను పరిశీలించిన మంత్రి
### భద్రకాళి, వెయ్యి స్థంబాల ఆలయంలో ప్రత్యేక పూజలు
### హరిత కాకతీయ హోటల్ లో వివిధ విభాగాల అధికారులతో సమీక్ష సమావేశం
### రైల్వే మ్యానుఫ్యాక్చరింగ్ యూనిట్ ను పరిశీలించిన మంత్రి
### హరిత కాకతీయ హోటల్ లో మీడియా ప్రతినిధులతో సమావేశం

**హన్మకొండ 29 నవంబర్ 2025(జై భీమ్ న్యూస్)**

హైదరాబాద్ తర్వాత అతి పెద్ద రెండవ నగర మైన వరంగల్ నగర అభివృద్ధికి కేంద్ర ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ వహిస్తుందని కేంద్ర బొగ్గు, గనుల శాఖ మంత్రి జీ.కిషన్ రెడ్డి అన్నారు. శనివారం నగరంలో వివిధ కార్యక్రమాల్లో పాల్గొనడానికి మంత్రి వందేభారత్ రైలులో హైదరాబాద్ నుండి వరంగల్ రైల్వే స్టేషన్ కు చేరుకొని ఆధునీకరణ పనులను క్షేత్ర స్థాయిలో పరిశీలించారు. అనంతరం భద్రకాళి,వేయిస్తంభాల ఆలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భం గా ఆలయ సాంప్రదాయం ప్రకారం అర్చకులు పూర్ణ కుంభంతో స్వాగతం పలికి అమ్మ వారి శేష వస్త్రాన్ని ,ప్రసాదాన్ని అందజేశారు. వేయిస్తంభాల ఆలయ ఆవరణ లో గల కళ్యాణ మండపం పనుల పురోగతిని ఆర్కియాలజీ అధికారులను అడిగి తెలుసుకున్నారు. హరిత కాకతీయ హోటల్ కు చేరుకొని పోలీసు వారి గౌరవ వందనాన్ని స్వీకరించి కాన్ఫరెన్స్ హాల్ లో కాకతీయ పట్టణాభివృద్ధి సంస్థ, జీడబ్ల్యూఎంసి, ఆర్కియాలజీ, స్మార్ట్ సిటీ తదితర అభివృద్ధి పనుల పురోగతిని అధికారులను అడిగి తెలుసుకుని సమర్థవంతం గా చేపట్టుటకు తగు సూచనలు చేశారు. హన్మకొండ జిల్లా పరిధిలో గల అయోధ్యపురంలో గల రైల్వే మాన్యుఫాక్చరింగ్ యూనిట్ (ఆర్ ఎం యు) ను మంత్రి క్షేత్ర స్థాయిలో సందర్శించారు. అనంతరం హరిత కాకతీయ హోటల్ లోని మినీ కాన్ఫరెన్స్ హాల్ లో పాత్రికేయులతో ఏర్పాటు చేసిన సమావేశం లో మంత్రి పాల్గొని కేంద్ర ప్రభుత్వం నగరంలో చేపట్టిన చేపట్టబోతున్న వివిధ అభివృద్ధి పనులను గురించి తెలియజేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ వరంగల్ నగరంతో పాటు చుట్టు పక్కల ప్రాంతాల్లో కేంద్రప్రభుత్వం ద్వారా అమలు చేస్తున్న పథకాలను సమీక్షించేందుకు ఇక్కడికి వచ్చాను. దేశవ్యాప్తంగా కేంద్రం అభివృద్ధి చేస్తున్న 40 రైల్వే స్టేషన్లలో మొదటగా వరంగల్ రైల్వే స్టేషన్ పూర్తయింది. అభివృద్ధి పనులపై కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ అధికారులతో చర్చించి, అనేక విషయాలు తెసుకున్నాను. అమృత్, హృదయ్, హెరిటేజ్ సిటీ పథకాల కింద జరుగుతున్న పనులను సమీక్షించాను. 7 మెగా టెక్స్ టైల్ పార్కుల్లో ఒకటైన కాకతీయ మెగా టెక్స్ టైల్ పార్కు పనుల గురించి కూడా సమీక్షించాను. ఇప్పటికే భూసేకరణ పనులు దాదాపు పూర్తయ్యాయి. ఇప్పటికే రాష్ట్ర ప్రభుత్వానికి రూ.30 కోట్లు అందజేశాం. మరో రూ.30 కోట్లు త్వరలోనే కేటాయిస్తాం. మొత్తం రూ.200 కోట్లతో కేంద్ర ప్రభుత్వం ఈ మెగా టెక్స్ టైల్ పార్కు నిర్మాణం చేపట్టనున్నాం. ఈ పార్కు ద్వారా రూ.1,700 కోట్ల పెట్టుబడులు వస్తాయి. 12,500 మందికి ఉపాధి కలుగుతుంది. ఎవర్ టాప్ టెక్స్ అనే కొరియా కంపెనీ రూ.1100 కోట్ల మేర పెట్టుబడులు పెట్టనుంది. 11 వేల మందికి ఉపాధి కల్పిస్తామని ఒప్పందం చేసుకుంది. ప్రధానమంత్రి నరేంద్రమోదీని ఆహ్వానించి పార్కు భూమిపూజ చేయించాలనే ఉద్దేశంతో ఉన్నాం. వరంగల్ మామునూరు ఎయిర్ పోర్టు విషయంలో 696 ఎకరాల భూమి ఎయిర్ పోర్టు అధికారుల వద్ద ఉంది. ఇప్పటికే ఈ ఎయిర్ పోర్టు నిర్మాణానికి సంబంధించి క్లియరెన్స్ వచ్చింది. 2021లో నాటి పౌర విమానయాన శాఖ మంత్రి జ్యోతిరాదిత్య సింధియా వరంగల్ వచ్చి, నాటి సీఎం కేసీఆర్ కు మామునూరు ఎయిర్ పోర్టు నిర్మాణానికి ముందుకు రావాలని లేఖ ద్వారా కోరారు. ఇదే విషయంలో సహకరించాలని 2022 జూలై, 2023 ఫిబ్రవరిలో నేను స్వయంగా కేసీఆర్ కి లేఖ రాశాను. అయితే ఎలాంటి స్పందన రాలేదు. ఇప్పుడు 280 ఎకరాల భూమి సేకరించేందుకు ముందుకు వచ్చింది. భూసేకరణ త్వరగా ఎయిర్ పోర్టు అథారిటీకి అందజేస్తే త్వరగా నిర్మాణం ప్రారంభించాలని కేంద్ర ప్రభుత్వం భావిస్తోంది. కాజీపేటలోని రైల్ మానుఫ్యాక్చరింగ్ యూనిట్ త్వరగా నిర్మాణం పూర్తి చేయాలని ఎప్పటికప్పుడు రైల్వే అధికారులను ఆదేశిస్తున్నాను. వచ్చే ఏడాది పనులు పూర్తి అవుతాయని భావిస్తున్నాను. వేయిస్తంభాల ఆలయ మంటపాన్ని పూర్తి స్థాయిలో పునర్నిర్మాణం చేశాం. వరంగల్ కోటకు సంబంధించిన భూమి అన్యాక్రాంతం అవుతోంది. అక్రమ కట్టడాల గురించి జిల్లా కలెక్టర్ కు ఆర్కియాలాజికల్ సర్వే ఆఫ్ ఇండియా లేఖలు రాస్తున్నా కూడా ఎలాంటి ఫలితం లేకుండా పోతోంది. దీనిపై సీఎం, సీఎస్ కు లేఖ రాస్తాను. అమృత్ పథకం ద్వారా వరంగల్ నగరాభివృద్ధికి విడుదల చేసిన నిధులను వినియోగించుకుని పనులు పూర్తి చేయాలని ఆదేశించాను. అర్బన్ ఇన్ ఫ్రా స్ట్రక్చర్ కింద రూ.412 కోట్లు, హృదయ్ పథకం కింద ఘన్ పూర్ దేవాలయం, పద్మాక్షి దేవాలయం, కాజీపేట దర్గా, పురాతన కట్టడాల అభివృద్ధి పనుల కోసం విడుదల చేసిన నిధులను వాడుకోవాలని సూచించాను. రామప్ప ఆలయం అభివృద్ధి కోసం కేంద్రం రూ.146 కోట్లు కేటాయించింది. పత్తి కొనుగోళ్లకు సంబంధించి రైతులకు ఇబ్బంది కలగకుండా చర్యలు తీసుకోవాలని సీసీఏ అధికారులను ఆదేశించాను. 2024-25లో 41 లక్షల బేళ్ల పత్తిని తెలంగాణలో కేంద్రం కొనుగోలు చేసింది. గతేడాది 110 కొనుగోలు కేంద్రాలు ఉండగా, ఇప్పుడు 123 కేంద్రాలకు పెంచి పత్తి కొనుగోళ్లు చేపడుతున్నాం. తేమ సమస్య కూడా పరిష్కారమైంది. రైతులు తీసుకొస్తున్న పత్తిలో తేమ శాతం సగటున 8 నుంచి 9 శాతం ఉంటోంది. సీసీఐ 12 శాతం వరకు తేమ ఉన్నా కూడా తీసుకునేందుకు సుముఖత వ్యక్తం చేసింది. పత్తి రైతులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదు. దళారుల మాటలను విని మోస పోవద్దని రైతులను కోరుతున్నాను. 2014 వరకు ఇప్పటివరకు కేంద్రం సుమారు రూ.60 వేల కోట్ల ఎమ్మెస్పీ చెల్లించి కొనుగోళ్లు చేపట్టింది. రేషన్ సన్న బియ్యం పంపిణీలో ఎక్కువ భాగం కేంద్ర ప్రభుత్వ నిధులే ఉన్నాయి. రూ.1.20 లక్షల కోట్ల విలువైన జాతీయ రహదారుల నిర్మాణానికి కేంద్రం ఖర్చు చేసింది. వరంగల్-మంచిర్యాల 4 లేన్ల హైవే, కరీంనగర్-వరంగల్ హైవే పనులు వేగవంతంగా జరుగుతున్నాయి. ఈ రోడ్ల నిర్మాణానికి రూ.2400 కోట్లు ఖర్చు పెడుతున్నాం. వరంగల్ రింగ్ రోడ్డు పనులపై కూడా సమీక్ష చేపట్టాను. ఇప్పటికే 50 శాతం నిర్మాణం పూర్తయింది. మిగిలిన నిర్మాణం చేపట్టేందుకు ప్రణాళికలు రచించాలని అధికారులకు సూచించాను. తెలంగాణ అభివృద్ధికి కేంద్ర ప్రభుత్వం ఎప్పుడూ కట్టుబడి ఉంటుంది. వరంగల్ నగరంతో పాటు చుట్టు పక్కల ప్రాంతాల్లో కేంద్రప్రభుత్వం ద్వారా అమలు చేస్తున్న పథకాలను సమీక్షించేందుకు ఇక్కడికి వచ్చాను. దేశవ్యాప్తంగా కేంద్రం అభివృద్ధి చేస్తున్న 40 రైల్వే స్టేషన్లలో మొదటగా వరంగల్ రైల్వే స్టేషన్ పూర్తయింది. అభివృద్ధి పనులపై కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ అధికారులతో చర్చించి, అనేక విషయాలు తెసుకున్నాను. అమృత్, హృదయ్, హెరిటేజ్ సిటీ పథకాల కింద జరుగుతున్న పనులను సమీక్షించారు. ఈ కార్యక్రమంలో బల్దియా కమిషనర్ చాహత్ బాజ్ పాయ్, కార్పొరేటర్ లు గుజ్జుల వసంత చాడ స్వాతి, రావుల కోమల కిషన్ డిఆర్ఓ విజయలక్ష్మి, కుడా సిపిఓ అజిత్ రెడ్డి, బల్దియా ఎస్ ఈ సత్యనారాయణ మాజీ ఎం పి.సీతారాం నాయక్ మాజీ శాసనసభ్యులు అరూరి రమేష్ ,కొండేటి శ్రీధర్, ధర్మారావు వన్నాల శ్రీరాములు ఆర్కియాలజీ అధికారులు తదితరులు పాల్గొన్నారు.



## ముసాయిదా విత్తన బిల్లు - 2025పై భీమారంలో విస్తృత చర్చ

**హన్మకొండ, నవంబర్ 29(జై భీమ్ న్యూస్)**

భారత ప్రభుత్వం ప్రతిపాదించిన ముసాయిదా విత్తన చట్టం-2025 పై భాగస్వాముల అభిప్రాయాలను సేకరించేందుకు హనుమకొండ జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు, జిల్లా వ్యవసాయ అధికారి రవిందర్ సింగ్ ఆధ్వర్యంలో భీమారం రైతు వేదికలో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ అధికారులు, రైతు ప్రతినిధులు, విత్తన డీలర్లు, కంపెనీలు, విత్తన ఉత్పత్తిదారులు పాల్గొని ముసాయిదా బిల్లులోని ముఖ్య అంశాలపై విస్తృతంగా చర్చించారు. నాసిరకం విత్తనాల వల్ల పంట ఉత్పత్తి మరియు విక్రయ దశలో రైతులకు నష్టం కలిగితే, నిర్దిష్ట కాలవ్యవధిలో చట్టబద్ధ నష్టపరిహారం అందేలా బిల్లు ప్రతిపాదించిన నిబంధనలను సమావేశంలో లోతుగా పరిశీలించారు. రైతులకు న్యాయం అందేలా ఈ నిబంధనలు ఎంతవరకు ఉపయోగకరమవుతాయో పాల్గొన్నవారు తమ అభిప్రాయాలు వ్యక్తం చేశారు. ఇక విత్తన ఉత్పత్తి మరియు విక్రయ కార్యకలాపాలపై సమర్థవంతమైన నియంత్రణ వ్యవస్థను అమలు చేయడం, పత్తి, వరి, పప్పుధాన్యాలు, మొక్కజొన్న, కూరగాయల వంటి విత్తనాల ఉత్పత్తి%-%విక్రయ ధరల నియంత్రణ, విత్తన విక్రయదారుల లైసెన్సింగ్ విధానం, మార్గదర్శకాల బలోపేతం, సీడ్ టెస్టింగ్ ప్రక్రియలు, విత్తనాల దిగుమతి నిబంధనలు, విత్తన ప్రాసెసింగ్ యూనిట్ల నియంత్రణలో ఉన్న లోపాల సవరణ వంటి పలు అంశాలపై సమావేశంలో కూలంకషమైన చర్చ సాగింది. ముసాయిదా విత్తన బిల్లుపై సేకరించిన సూచనలు, అభిప్రాయాలన్నింటినీ సమగ్రంగా ప్రభుత్వానికి పంపిస్తామని జిల్లా వ్యవసాయ అధికారి రవిందర్ సింగ్ తెలిపారు. బిల్లుతో రైతులకు మరింత రక్షణ, పారదర్శకత, న్యాయం లభించడమే ప్రధాన లక్ష్యమని ఆయన పేర్కొన్నారు. సమావేశంలో జిల్లా వ్యవసాయ అధికారులు, శాస్త్రవేత్తలు మరియు విత్తన రంగ నిపుణులు పాల్గొన్నారు.






## మొరిపిరాల సర్పంచ్‌గా పెద్దగోని నాగరాజు ఏకగ్రీవ ఎంపిక

**రాయపర్తి, నవంబర్ 29(జై భీమ్ న్యూస్)**

రాయపర్తి మండలంలోని మొరిపిరాల గ్రామ సర్పంచ్‌గా పెద్దగోని నాగరాజును గ్రామస్తులు శనివారం పార్టీలకు అతీతంగా ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. గతంలో గ్రామ పంచాయితీ కారొబార్ విధులు నిర్వహించిన నాగరాజు, తన సమస్యల పరిష్కారం పట్ల చూపిన కృషికి గ్రామ ప్రజలు విశ్వాసం వ్యక్తం చేశారు. ఎన్నిక అనంతరం పెద్దగోని నాగరాజు మాట్లాడుతూ, తనను సర్పంచ్‌గా ఏకగ్రీవంగా ఎన్నుకున్న గ్రామ ప్రజలకు, రాజకీయ నాయకులకు, కుల సంఘాల నాయకులకు హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు. గ్రామాభివృద్ధి కోసం తాను మరింత కృషి చేస్తానని చెప్పారు. గ్రామంలో శాంతియుత వాతావరణంలో జరిగిన ఈ ఎన్నికపై పెద్దలు, యువత సంతోషం వ్యక్తం చేశారు.



# కేసీఆర్ ఆమరణ నిరాహార దీక్ష దినోత్సవం ఘనంగా నిర్వహణ





**తెలంగాణ కోసం ప్రాణం అర్పించిన నేత కేసీఆర్ : నేతల నివాళులు**

**హన్మకొండ, నవంబర్ 29 (జై భీమ్ న్యూస్)**

తెలంగాణ రాష్ట్ర స్థాపనలో కీలకమైన మలుపు తిప్పిన 2009 కేసీఆర్ ఆమరణ నిరాహార దీక్ష వార్షికోత్సవంను పురస్కరించుకుని హనుమకొండ నక్కలగుట్టలోని కాళోజీ విగ్రహం వద్ద శనివారం దీక్షా దినోత్సవ కార్యక్రమం ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమానికి శాసనమండలి ప్రతిపక్ష నేత, ఎమ్మెల్సీ సిరికొండ మధుసూదన చారి, రాజ్యసభ మాజీ సభ్యుడు కెప్టెన్ లక్ష్మీకాంత రావు, మాజీ చీఫ్ విప్, బీఆర్ఎస్ హనుమకొండ జిల్లా అధ్యక్షుడు దాస్యం వినయ్ భాస్కర్ ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. కార్యక్రమ ప్రారంభంలో తెలంగాణ అమరవీరులకుఒక నిమిషం మౌనం పాటించారు. అనంతరం తెలంగాణ తల్లి విగ్రహం, అమరవీరుల స్థూపం, కాళోజీ విగ్రహానికి పూలమాలలు అర్పించి శ్రద్ధాంజలి ఘటించారు.

**తెలంగాణ కోసం ప్రాణాలకే తెగించిన వీరుడు కేసీఆర్ : మధుసూదన చారి**

ఎమ్మెల్సీ సిరికొండ మధుసూదన చారి మాట్లాడుతూ ం తెలంగాణ కోసం ప్రాణాలు అర్పించేందుకు సిద్ధమైన నాయకుడు కేసీఆర్. 14 ఏళ్లపాటు అలుపెరగని పోరాటంతో తెలంగాణ ఆత్మను మేల్కొలిపి, స్వరాష్ట్ర సాధనకు ప్రధాన శక్తిగా నిలిచారు," అని పేర్కొన్నారు. 4 కోట్ల తెలంగాణ ప్రజల ఆశయాన్ని నెరవేర్చిన కారణజన్ముడు కేసీఆర్" అని ఆయన ప్రశంసించారు.

**కేసీఆర్ పోరాటంతోనే తెలంగాణ సాధ్యమైంది.. కెప్టెన్ లక్ష్మీకాంత రావు**

రాజ్యసభ మాజీ సభ్యుడు కెప్టెన్ లక్ష్మీకాంత రావు మాట్లాడుతూ "2001లో పార్టీ ఆవిర్భావం నుంచి 2009 ఆమరణ నిరాహార దీక్ష వరకు జరిగిన ప్రతి అడుగులోనూ నేను కేసీఆర్‌తో ఉన్నాను. ఆయన పోరాటం వల్లే తెలంగాణ వాస్తవమైంది," అన్నారు. అయన గుర్తుచేసుతూ ం ఆమరణ దీక్ష సమయంలో కేసీఆర్‌ను అక్రమంగా అరెస్ట్ చేయగా, తెలంగాణ ప్రజలంతా వీధుల్లోకి వచ్చి ఉద్యమాన్ని భుజాలపై మోశారు. 11 రోజుల దీక్షతో నాటి కేంద్ర ప్రభుత్వాన్ని మెడలు వంచించారు, అన్నారు. 14 ఏళ్ల దీక్షా-దీక్షిత పోరాటం, 10 ఏళ్ల పాలనతో తెలంగాణను దేశంలో ముందంజ రాష్ట్రంగా నిలబెట్టింది కేసీఆర్ నాయకత్వమే అని చెప్పారు.

**టెలంగానా కల సాకారం చేసిన నేత కేసీఆర్ : దాస్యం వినయ్ భాస్కర్**

మాజీ చీఫ్ విప్ దాస్యం వినయ్ భాస్కర్ మాట్లాడుతూ టెలంగానా ప్రజల 60 ఏళ్ల స్వరాష్ట్ర స్వప్నాన్ని సాకారం చేసిన నేత కేసీఆర్. 14 ఏళ్ల పోరాటంతో తెలంగాణను సాధించిన ఉద్యమ శిఖరం అదే కేసీఆర్, అన్నారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వం చేసిన సంక్షేమ–అభివృద్ధి కార్యక్రమాలు తెలంగాణను దేశంలో ఆదర్శంగా నిలబెట్టాయి. 'కేసీఆర్ సచ్చుడో%ా% తెలంగాణ వచ్చుడో' అనే నినాదం ప్రజల్లో విప్లవాత్మక సంచలనం రేపింది," అని అన్నారు. ఇప్పటి కాంగ్రెస్ ప్రభుత్వంపై విమర్శలు చేస్తూ – ప్రజల సమస్యలను లెక్కచేయడం లేదు. ప్రశ్నించిన వారిని కేసులతో వేధిస్తున్న పరిస్థితి నెలకొంది," అని తెలిపారు. బీఆర్ఎస్, కేసీఆర్, కేటీఆర్ నాయకత్వంలో ప్రజల పక్షాన పోరాటం కొనసాగుతుందని చెప్పారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యేలు చల్లా ధర్మారెడ్డి, వొడితల సతీష్ బాబు, మాజీ చైర్మన్లు నాగూర్ల వెంకటేశ్వర్లు, లింగంపెల్లి కిషన్ రెడ్డి, మర్రి యాదవ్ రెడ్డి, ఎల్లావుల లలితా యాదవ్, గ్రేటర్ వరంగల్ డిప్యూటీ మేయర్ రిజ్వానా మసూద్, కార్పొరేటర్లు, మాజీ కార్పొరేటర్లు మరియు అనేక మంది బీఆర్ఎస్ నాయకులు పాల్గొన్నారు.

## యూత్ కాంగ్రెస్ నాయకుడు తోట పవన్‌పై కేసు నమోదు చేయాలి

**స్వేరో జిల్లా అధ్యక్షుడు ఎల్తూరి సాయికుమార్**

**అభిమానులు, విద్యార్థుల మనోభావాలను దెబ్బతీసే వ్యాఖ్యలు చేశాడని ఆరోపణ**




**హన్మకొండ, నవంబర్ 29(జై భీమ్ న్యూస్)**

హనుమకొండ జిల్లా స్వేరో స్టూడెంట్స్ యూనియన్ (ఎస్.ఎస్.యూ) అధ్యక్షులు ఎల్తూరి సాయికుమార్ తీవ్రంగా స్పందించారు. నిన్న హనుమకొండ జిల్లాలో జరిగిన మీడియా సమావేశంలో డాక్టర్ ఆర్.ఎస్. ప్రవీణ్‌కుమార్ కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాల వైఫల్యాలను, ముఖ్యంగా వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి ప్రాతినిధ్యం వహిస్తున్న నియోజకవర్గంలో జరిగుతున్న సమస్యలను ఎండగట్టారని తెలిపారు. దీనికి ప్రతిగా యూత్ కాంగ్రెస్ నాయకుడు తోట పవన్ సోషల్ మీడియా వేదికగా చేసిన వ్యక్తిగత వ్యాఖ్యలు ఆక్షేపణీయమని, అవి ప్రవీణ్‌కుమార్ గారి గౌరవాన్ని దెబ్బతీసే విధంగా ఉన్నాయని సాయికుమార్ పేర్కొన్నారు. తన వ్యాఖ్యల్లో గుండు మీద బొచ్చు లేదు%ా% గుండు లోపల మెదడు లేదు%ా% వంటి అనుచిత పదజాలాన్ని ప్రయోగించడం ద్వారా తోట పవన్ యావత్ తెలంగాణ స్వేరోస్, అభిమానులు, విద్యార్థుల మనోభావాలను దెబ్బతీశాడని ఆయన తెలిపారు. ఈ నేపథ్యంలో తోట పవన్‌పై తక్షణం క్రిమినల్ కేసు నమోదు చేయాలని డిమాండ్ చేస్తూ, హనుమకొండ పోలీస్ స్టేషన్ ఎస్‌హెచ్‌ఓ ఇన్‌ఛార్జ్ ఎస్ఐ సతీష్ కు పిటిషన్ ఇచ్చినట్లు సాయికుమార్ వివరించారు. ఈ కార్యక్రమంలో స్వేరో స్టూడెంట్స్ యూనియన్ (ఎస్.ఎస్.యూ) కాకతీయ ప్రభుత్వ డిగ్రీ కళాశాల అధ్యక్షులు చెట్టుపల్లి శివకుమార్, ఓకేషనల్ కళాశాల నాయకులు రణదీర్, చరణ్, వినయ్ తదితరులు పాల్గొన్నారు.

## తండ్రి హృదయపూర్వక త్యాగం

**కూతురి ప్రాణాలను కాపాడటానికి కిడ్నీ దానం**

**మెడికోవర్ హాస్పిటల్ వైద్య నిపుణులకు మరో ఉదాహరణ**




**బెంగళూరు జై భీమ్ న్యూస్ :**

తన కూతురు కోసం ఏదైనా చేయడానికి సిద్ధంగా ఉన్న తండ్రి తీవ్ర అనారోగ్యంతో ఉన్న తన కూతురిని కాపాడటానికి తన కిడ్నీలలో ఒకదాన్ని దానం చేశాడు. ఆమె కూతురు ఎడిపికెడి వ్యాధితో బాధపడుతోంది, ఇది మూత్రపిండాల వైఫల్యానికి కారణమైన జన్యుపరమైన సమస్య. ఈ వ్యాధి అతని కుటుంబానికి కొత్త కాదు. 2013లో, అదే వ్యాధితో బాధపడుతున్న తన భార్యకు కిడ్నీ దానం చేయడానికి అతను ముందుకు వచ్చాడు. అయితే, శస్త్రచికిత్స సమయంలో సాంకేతిక ఇబ్బందుల కారణంగా, ఆ సమయంలో కిడ్నీ మార్పిడి చేయలేకపోయాడు. ఇప్పుడు, తన కూతురికి మళ్ళీ అదే సమస్య వచ్చినప్పుడు, ఆమె కిడ్నీలు విఫలమైనప్పుడు, తండ్రి, మరో ఆలోచన లేకుండా, తన ఏకైక కూతురిని కాపాడటానికి మళ్ళీ ముందుకు వచ్చాడు. 61 ఏళ్ల తండ్రి డయాబెటిస్ మరియు రక్తపోటుతో బాధపడుతున్నప్పటికీ, బెంగళూరు నగరంలోని మహాదేవ నియోజకవర్గం వైట్ ఫీల్డ్ లోని మెడికోవర్ హాస్పిటల్‌లో జరిగిన సమగ్ర పరీక్షలో అతని ఆరోగ్య పరిస్థితి బాగుందని మరియు అవయవ నష్టం సంకేతాలు లేవని తేలింది. బహుళ విభాగ నిపుణుల బృందం సమీక్ష తర్వాత, అతన్ని మార్జినల్ దాతగా అంగీకరించారు. సీనియర్ నెఫ్రాలజిస్ట్ మరియు ట్రాన్స్‌ప్లాంట్ స్పెషలిస్ట్ డాక్టర్ హరీష్ బాబు కె, యూరాలజిస్ట్ మరియు కిడ్నీ ట్రాన్స్‌ప్లాంట్ స్పెషలిస్ట్ డాక్టర్ ప్రమోద్, కిడ్నీ ట్రాన్స్‌ప్లాంట్ సర్జన్ డాక్టర్ దిలీప్ బృందం ఆమె ప్రాణాలను కాపాడే శస్త్రచికిత్సను విజయవంతంగా నిర్వహించింది. దానం చేసిన కిడ్నీ వెంటనే పనిచేయడం ప్రారంభించింది. "సమగ్రమైన మరియు ఖచ్చితమైన వైద్య మూల్యాంకనంతో, నియంత్రిత మధుమేహం మరియు రక్తపోటుతో కూడా వృద్ధ దాతలను మూత్రపిండ దానం కోసం సురక్షితంగా పరిగణించవచ్చు. తగిన దాతల కొరతతో బాధపడుతున్న అనేక కుటుంబాలకు ఇది కొత్త ఆశాకిరణం" అని డాక్టర్ హరీష్ బాబు కె అన్నారు.

## తప్పిపోయిన బాలుడిని గుర్తించి తల్లిదండ్రుల వద్దకు చేర్చిన మడికొండ పోలీసులు

**వరంగల్, నవంబర్ 29 (జై భీమ్ క్రైమ్ న్యూస్)**



మడికొండ పోలీస్ స్టేషన్ పరిధిలోని బట్టుపల్లి గ్రామంలో ఇంటర్మీడియట్ ఫస్ట్ ఇయర్‌లో చదువుతున్న కీసరి శివరాం రెడ్డి అనే బాలుడు రెండు రోజుల క్రితం నుండి కనిపించకపోవడంతో కుటుంబ సభ్యులు ఆందోళనకు గురయ్యారు. కేసు నమోదు చేసిన మడికొండ పోలీసులు గాలింపు చర్యలు వేగవంతం చేసి, బాలుడిని చాకచక్యంగా గుర్తించి భద్రతగా కుటుంబ సభ్యుల వద్దకు చేర్చారు. కనిపించకుండా వెళ్లిన బాలుడు హాస్టల్‌లో ఒంటరిగా ఉన్న భావనతో, ఆందోళన కారణంగా కాలేజీ నుంచి వెళ్లిపోయినట్లు పోలీసులు తెలిపారు. బాలుడిని తిరిగి అతని తండ్రి రవీందర్ రెడ్డి గారికి పోలీసులు అప్పగించారు. ఈ సందర్భంలో మడికొండ ఇన్స్పెక్టర్ పుల్యాల కిషన్ మాట్లాడుతూ, విద్యార్థులు జీవితంలో ఎదురయ్యే చిన్న సమస్యల వల్ల నిరాశ చెందకుండా, తల్లిదండ్రులు%-%ఉపాధ్యాయులతో మాట్లాడి సమస్యలను పరిష్కరించుకోవాలని సూచించారు. "పారిపోవడం సమస్యకు పరిష్కారం కాదు. సమస్యను అర్థం చేసుకుని ఎదుర్కొంటేనే భవిష్యత్తులో ముందుకు సాగగలరు" అని విద్యార్థులకు పిలుపునిచ్చారు.

## అగ్రవర్ణ వాళ్లు కోట్లాది రూపాయల విలువైన దళిత ఆస్తిని ఆక్రమించుకొని నకిలీ పత్రాలను సృష్టించరూ : శ్రీకాంత్ రావణ్

**హొసకోటే (బెంగళూరు గ్రామమంతర జిల్లా) జై భీమ్ న్యూస్:**

అగ్రవర్ణ వాళ్లు కోట్లాది రూపాయల విలువైన దళిత వర్గానికి చెందిన ఆస్తిని ఆక్రమించుకోనీ మరియు నకిలీ పత్రాలను సృష్టించరూ అని భీమ్ సేవా సమితి రాష్ట్ర అధ్యక్షుడు శ్రీకాంత్ రావణ్ ఆరోపించారు. ఆయన మాట్లాడుతూ బెంగళూరు తూర్పు తాలూకా. నింబకాయపుర గ్రామంలోని బిదరహళ్లి హొబ్లిలోని సర్వే నంబర్ 52/పి5లో, 1937లో దళిత వర్గానికి చెందిన గురుపల్లి మునిషామికి 2-00 ఎకరాల విస్తీర్ణాన్ని బిడ్ ద్వారా కేటాయించారు. ఈ భూమి యొక్క ఖాతా దళితుల పేరు మీద ఉన్నాయి మరియు వాటిని స్వాధీనంలో ఉన్న ఆస్తిగా పరిగణిస్తారు. ఈ భూమిని అతని ఏకైక కుమార్తె ఎర్రమ్మ తండ్రి గురుపల్లి మునిషామికి రిజిస్టర్డ్ డాక్యుమెంట్ నంబర్: 715/1945-40 తేదీ: 11/10/1945 కింద విరాళంగా ఇచ్చారు మరియు అతను పూర్తి టైటిల్‌ను వదులుకున్నాడు. గురుపల్లి మునిషామి ఆ భూమి యొక్క భూమి అయిన ఎర్రమ్మను ఖాతాగా చేయలేదు. మరియు ఆ భూమి అతని వద్ద మాత్రమే ఉంది. ఎరమ్మ తండ్రి గురుపల్లి మునిషామి మరణం తరువాత, కుటుంబ సభ్యులు ఆ భూమిలో వ్యవసాయ పనులు చేస్తున్నారు, మరియు ఖాతా జరగలేదని తెలిసి, ఎరప్ప అనే భూ దొంగ నకిలీ పత్రాలు సృష్టించి, ఆ భూమిని మరొక వ్యక్తికి విక్రయించాడు. కానీ అగ్రవర్గానికి చెందిన కుటుంబం ఆ భూమిని కలిగి ఉంది మరియు పైన పేర్కొన్న లావాదేవీలన్నీ అనధికార పరాయీకరణ. ఈ విషయంపై బెంగళూరు తూర్పు తాలూకా. బిదరహళ్లి హొబ్లిలోని నింబకాయపూర్ గ్రామంలోని సర్వే నంబర్ 52/పి5లో 2-00 ఎకరాల విస్తీర్ణంలో ఉన్న ఈ భూమికి సంబంధించి ఇతర లావాదేవీలు చేయకూడదని కోరుతూ కె.ఆర్. పురం తూర్పు తాలూకా కార్యాలయంలో కూడా ఫిర్యాదు చేయబడింది. నకిలీ పత్రాలు సృష్టించి, దళితుల భూములను చాలా త్వరగా స్వాధీనం చేసుకోవడానికి ప్రయత్నిస్తున్న భూ దొంగలపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని సంబంధిత డిసిఆర్ఇ మరియు వివిధ విభాగాలకు ఫిర్యాదు చేయబడింది. నకిలీ పత్రాలను రద్దు చేయకపోతే అహోరాత్రి ధర్నా నిర్వహిస్తామని కూడా ఆయన సంబంధిత అధికారుల దృష్టికి తీసుకువచ్చారు. ఈ సందర్భంగా భీమ్ సేవా సమితి రాష్ట్ర అధ్యక్షుడు శ్రీకాంత్ రావణ్, భారతీయర సేవాసమితి జాతీయ అధ్యక్షుడు డాక్టర్ రామచంద్ర హూడి చిన్ని, సామాజిక కార్యకర్త కురుడు సొన్నెనహళ్లి యువశక్తి సూరి, మూలనివాసి అంబేద్కర్ సంఘం రాష్ట్ర కార్యదర్శి మునిరాజ్,యువజన విభాగం రాష్ట్ర అధ్యక్షుడు గంగాధర్ బి.సి, డ్రైవర్ జిల్లా అధ్యక్షుడు మునిరాజ్ బి.ఆర్, ఆటో యూనిట్ జిల్లా అధ్యక్షుడు శ్రీనాథ్ సి. లేబర్ యూనిట్ జిల్లా అధ్యక్షుడువరుణ్ రాజ్ చక్రవర్తి, మైనారిటీ అధ్యక్షుడు సయ్యద్ ఆగ బె.గ్రా జిల్లా అధ్యక్షుడు కిరణ్ పృథ్వీ, ఆటో యూనిట్ బెం.గ్రా పూఎం తాఎఅధ్యక్షుడు సూర్య (సూరి), యూత్ యూనిట్ అధ్యక్షుడు తరుణ్,లేబర్ యూనిట్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు వినయ్ కుమార్, ఆటో యూనిట్ రాష్ట్ర అధ్యక్షుడు నగేష్ సి,భీమ్ సేవా సమితి అధ్యక్షుడు రవి భువనహళ్లి డివిజన్ అధ్యక్షుడు మరియు సంఘాల నాయకులు పాల్గొన్నారు.



## శ్రీ సమ్మక్క-సారలమ్మ మేడారం జాతర 2026

**వైద్య సేవల సన్నాహాలు వేగవంతం**

**ఉమ్మడి వరంగల్, భద్రాద్రి-కొత్తగూడెం జిల్లాల వైద్య అధికారులతో సమన్వయ సమీక్ష - డైరెక్టర్ ఆఫ్ పబ్లిక్ హెల్త్ డా. రవీందర్ నాయక్**

**ములుగు, 29 నవంబర్ 2025(జై భీమ్ న్యూ)**

రాబోయే శ్రీ సమ్మక్క%-%సారలమ్మ మేడారం జాతర 2026కు సంబంధించి వైద్య సేవల ఏర్పాట్లను ధృడపరచేందుకు ములుగు జిల్లా కలెక్టర్ కాన్ఫరెన్స్ హాల్లో ఉమ్మడి వరంగల్ జిల్లా, భద్రాద్రి%-%కొత్తగూడెం జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారులతో సమన్వయ కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి ప్రత్యేకంగా హాజరైన డైరెక్టర్ ఆఫ్ పబ్లిక్ హెల్త్ అండ్ ఫ్యామిలీ వెల్ఫేర్, హైదరాబాద్ డా. రవీందర్ నాయక్ జాతర వైద్య సన్నాహాలపై కీలక సూచనలు చేశారు. జాతరకు వచ్చే కోట్లాది భక్తులకు నిరంతర, నాణ్యమైన వైద్య సేవలు అందించడం శాఖ యొక్క ప్రధాన బాధ్యతేనని పేర్కొన్న ఆయన, భారీ రద్దీ సమయంలో వైద్య సిబ్బంది ఒత్తిడిని తప్పించేందుకు డ్యూటీని ఓన్ చేసుకుని బాధ్యతగా పనిచేయాలని సూచించారు. మేడారం జాతరలో అత్యుత్తమ వైద్యసేవలు అందించేందుకు ఎంజీఎం ఆసుపత్రి వరంగల్, భూపాలపల్లి గవర్నమెంట్ జనరల్ హాస్పిటల్, ములుగు జనరల్ హాస్పిటల్‌ల నుండి నిపుణ వైద్యులను డిప్యూటేషన్‌పై తీసుకుంటున్నట్లు తెలిపారు. డిసెంబర్ 25 నుంచే ఉచిత వైద్య శిబిరాలు – భక్తులకు ఎటువంటి వైద్య ఇబ్బందులు తలెత్తకుండా డిసెంబర్ 25వ తేదీ నుంచి ఫిబ్రవరి 10 వరకు విస్తృతంగా ఉచిత వైద్య శిబిరాలను ఏర్పాటు చేయనున్నట్లు వివరించారు. శిబిరాల వివరాలు – డిసెంబర్ 25%-%31: రోజుకు 3 క్యాంపులు, జనవరి 1%-%18: రోజుకు 10 క్యాంపులు, జనవరి 19%-%27: రోజుకు 20 క్యాంపులు, జనవరి 28%-%31: రోజుకు 72 క్యాంపులు, ఫిబ్రవరి 1%-%10: జాతర అనంతర వైద్య శిబిరాలు. భక్తులకు అందించే ఈ క్యాంపుల్లో 340 రకాల మందులు, అవసరమైన సర్జికల్ పరికరాలు, మెడికల్ కిట్స్ సమృద్ధిగా నిల్వ ఉంచనున్నట్లు తెలిపారు.

**అత్యవసర సేవల విస్తరణ...**

జాతర ప్రాంతంలో అత్యవసర సేవలను మరింత బలపరచడానికి 19 ఎమర్జెన్సీ "108" అంబులెన్సులు, 40 బైక్ అంబులెన్సులు సిద్ధం చేస్తున్నట్లు పేర్కొన్నారు. అత్యవసర రిఫెరల్ సేవల కోసం తాడువాయి %ూఎజ%ని ఫస్ట్ రిఫెరల్ పాయింట్‌గా, జి.జి.హెచ్ ఏటూరు నాగారం మరియు ములుగును సెకండ్ రిఫెరల్ సెంటర్లుగా, టెరిషరీ సేవల కోసం ఎంజీఎం ఆసుపత్రిని వినియోగించనున్నట్లు చెప్పారు.

**డిప్యూటీ సిబ్బందికి శిక్షణ%-%సమన్వయం**

జాతరలో పనిచేయాల్సిన వైద్యులు, ప్యారామెడికల్ సిబ్బంది, రాపిడ్ రెస్పాన్స్ టీంలను ముందస్తుగానే డిప్యూట్ చేయడానికి సంబంధిత శాఖలకు లెటర్లు పంపుతున్నట్లు తెలిపారు. డిప్యూటీ సిబ్బంది సమన్వయంతో పనిచేయేందుకు సంబంధిత జిల్లా వైద్య శాఖ అధికారులు జూమ్ మీటింగులు నిర్వహించాలని సూచించారు. ఇంటర్ డిపార్ట్‌మెంటల్ సమన్వయం, ఔషధాల నిల్వలు, వ్యాధి పర్యవేక్షణ వ్యవస్థ బలోపేతం పై ప్రత్యేక దృష్టి పెట్టాలని ఆదేశించారు. ఈ సమావేశంలో ఉమ్మడి వరంగల్ జిల్లా, ములుగు జిల్లాల వైద్య ఆరోగ్యశాఖ అధికారులు డా. గోపాల్ రావు, డా. అప్పయ్య, డా. సాంబశివరావు, డా. మధుసూదన్, డా. మల్లికార్జున్, డా. రవి రాథోడ్, డా. ప్రసాద్, డా. విపిన్ కుమార్, డా. క్రాంతి కుమార్, డా. పవన్ కుమార్, డా. శ్రీకాంత్, ఏఎమ్ఒ సంపత్, కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ దుర్గారావు, ప్రసాద్, వెంకటపతి రాజు, మానిటరింగ్ సూపర్వైజర్లు వెంకట్ రెడ్డి, సురేష్ బాబు, భూపాల్ రెడ్డి, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల వైద్యాధికారులు, ఆర్బిఎస్కే డాక్టర్లు, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.




# ఓటిటి వేదికగా శివ విడుదల చేస్తాం: నాగ్




ఒకప్పటి కల్ట్ క్లాసిక్ 'శివ' ఇటీవల ప్రేక్షకుల ముందుకు వచ్చి మరోసారి సందడి చేసిన క్రమంలో.. ఇప్పుడీ చిత్రాన్ని ఓటీటీలోకి అందుబాటులోకి తెచ్చేందుకు ప్రయత్నాలు జరుగుతున్నాయని నాగార్జున చెప్పారు. తాజాగా గోవా వేదికగా జరిగిన ఇఫి వేడుకలో ఆయన పాల్గొన్నారు. 'శివ' గురించి, ఏయన్నార్ చిత్రాల గురించి మాట్లాడారు. శివ' రీరిలీజ్ వెర్షన్ ఓటీటీలో విడుదల చేసేందుకు సన్నాహాలు జరుగుతున్నాయి . ఇప్పటికే పలు సంస్థలతో చర్చలు జరిపాం. ఎంతో కష్టపడి దీన్ని 4కే వెర్షన్‌లోకి మార్చాం. అందరూ చూసి ఎంజాయ్ చేయాలనే తపనతోనే ఓటీటీలో విడుదల చేయాలని అనుకుంటున్నాం. ఇప్పుడు గొప్ప టెక్నాలజీ అందుబాటులోకి వచ్చింది. సినిమాలను 4కే లోకి ఎలా మార్చాలో అర్థమైంది. ఏఐ వచ్చిన తర్వాత ప్రతి పని సులభమైంది. అన్నపూర్ణ స్టూడియోస్‌లో మంచి సాంకేతికత అందుబాటులో ఉందని చెప్పారు. ఏయన్నార్ అలనాటి అనేక అపూర్వ సినిమాలను 4కే వెర్షన్‌లోకి మార్చాలంటే నెగెటివ్స్ లేవని చెప్పారు. అధునాతన సాంకేతిక హంగులతో ఏయన్నార్ పాత చిత్రాలను మళ్లీ ప్రేక్షకుల ముందుకు తీసుకురావాలని ఉన్నా.. రైట్స్, నెగెటివ్స్ లేకపోవడంతో సాధ్యం కావట్లేదని నాగార్జున తెలిపారు. తన 100వ చిత్రం నుంచి కూడా త్వరలోనే అప్‌డేట్స్ వస్తాయని తెలిపారు. అలాగే అఖిల్ తదుపరి చిత్రం 'లెనిన్' పనులు శరవేగంగా జరుగుతున్నాయని వెల్లడించారు.


# బాలకృష్ణ మాత్రమే ఆ పాత్ర చేయగలడు





'అఖండ 2' కథ చెప్పినప్పుడు తనకు గూస్‌బంప్స్ వచ్చాయని నటుడు మురళీ మోహన్ అన్నారు. బోయపాటి శ్రీను దర్శకత్వంలో బాలకృష్ణ నటించిన చిత్రం 'అఖండ 2'. డిసెంబర్ 5న ప్రేక్షకుల ముందుకు రానుంది. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన ప్రీ రిలీజ్ ఈవెంట్‌లో మురళీ మోహన్ మాట్లాడుతూ.. ఈ సినిమాలో బాలకృష్ణ కాకుండా మరొకరు చేయలేరు అనిపించిందన్నారు. బాలకృష్ణ మాత్రమే ఈ పాత్ర చేయగలడని నిరూపించారని అన్నారు. పాత్ర అంత పవర్‌ఫుల్‌గా ఉందన్నారు. బాలకృష్ణతో 'అఖండ 2' చేస్తే అందరికీ పరమేశ్వరుడే కనిపించాలన్న లక్ష్యంతో బరిలోకి దిగినట్లు దర్శకుడు బోయపాటి శ్రీను అన్నారు. ఆయన దర్శకత్వంలో బాలకృష్ణ హీరోగా ముస్తాబైన చిత్రం 'అఖండ 2' హైదరాబాద్‌లో ప్రీ రిలీజ్ ఈవెంట్ ఏర్పాటు చేశారు. ఆ భగవంతుడే తనతో ఈ చిత్రం చేయించుకున్నాడని బోయపాటి అన్నారు.

# ప్రభాస్ లుక్ కనిపించకుండా వంగా జాగ్రత్తలు

### ఆరు నెలలపాటు పబ్లిక్ ఈవెంట్‌లకు దూరంగా రెబల్



ప్రభాస్, సందీప్ రెడ్డి వంగా కాంబినేషన్‌లో రానున్న మోస్ట్-అవైటెడ్ యాక్షన్ ఎంటర్‌టైనర్ చిత్రం 'స్పిరిట్' గురించి ఒక ఆసక్తికరమైన వార్త ప్రస్తుతం టాలీవుడ్‌లో చర్చనీయాంశమైంది. ఈ సినిమా రెగ్యులర్ షూటింగ్ ఇటీవల మొదలవ్వగా, దర్శకుడు సందీప్ వంగా ప్రభాస్ లుక్ విషయంలో అత్యంత గోప్యత పాటిస్తున్నట్లు తెలుస్తోంది. తాజా సమాచారం ప్రకారం 'స్పిరిట్' సినిమాలోని ప్రభాస్ పాత్ర లుక్‌ను అభిమానులకు సర్‌ప్రైజ్‌గా ఉంచాలని సందీప్ వంగా గట్టిగా నిర్ణయించుకున్నారు. అందుకే, ఈ లుక్ లీక్ అవ్వకుండా ఉండేందుకు, రాబోయే ఆరు నెలల పాటు ప్రభాస్‌ని పబ్లిక్ ఈవెంట్స్‌కు దూరంగా ఉండాలని కోరినట్లు సమాచారం. పబ్లిక్ ఈవెంట్లు, ఎయిర్‌పోర్ట్‌లలో ప్రభాస్ కనిపిస్తే, ఆయన లుక్‌ను అభిమానులు లేదా మీడియా ఫొటోలు తీసే అవకాశం ఉంది. ఈ విషయాన్ని దృష్టిలో ఉంచుకుని, కొన్ని నెలల పాటు ఎలాంటి ప్రచార కార్యకలాపాలు లేదా బహిరంగ కార్యక్రమాలకు హాజరు కాకూడదని ప్రభాస్, సందీప్ వంగా నిర్ణయించుకున్నట్లుగా వార్తలు వినిపిస్తున్నాయి. ఈ నిర్ణయం ప్రభాస్ అభిమానులను కొంత నిరాశపరిచినా సందీప్ వంగా ప్రభాస్‌ను ఏ విధంగా ప్రెజెంట్ చేయబోతున్నారో చూడాలనే ఉత్సాహం మాత్రం వారిలో ఎక్కువగా ఉంది. 'స్పిరిట్' చిత్రంలో త్రిప్తి దిమ్రి కథానాయికగా నటిస్తుండగా, వివేక్ ఒబెరాయ్, ప్రకాశ్ రాజ్, కాంచన ఇతర ముఖ్య పాత్రల్లో కనిపించనున్నారు. ఈ భారీ చిత్రం 2027లో ప్రేక్షకుల ముందుకు వచ్చే అవకాశం ఉంది.ం



# స్పిరిట్‌లో హిందీనటి కాజోల్ నటిస్తుందా?

ప్రభాస్ హీరోగా, దర్శకుడు సందీప్ రెడ్డి వంగా తెరకెక్కిస్తున్న హై-వోల్టేజ్ యాక్షన్ డ్రామా 'స్పిరిట్'. ఈ చిత్రం మెగాస్టార్ చిరంజీవి చేతుల మీదుగా ఇటీవల పూజా కార్యక్రమాలు పూర్తి చేసుకున్న విషయం తెలిసిందే. ప్రస్తుతం ఈ సినిమా షూటింగ్ జరుపుకుటుండగా.. ఈ ప్రాజెక్ట్ గురించి ఇండస్ట్రీలో ఒక ఆసక్తికరమైన వార్త ప్రస్తుతం జోరుగా వినిపిస్తోంది. ఈ ప్రతిష్టాత్మక చిత్రంలో బాలీవుడ్ సీనియర్ స్టార్ హీరోయిన్ కాజోల్ దేవగణ్ కీలక పాత్ర పోషించనున్నట్లు తెలుస్తుంది. 'స్పిరిట్' చిత్రంలో మొదట హీరోయిన్ పాత్ర కోసం బాలీవుడ్ నటి కరీనా కపూర్ పేరు వినిపించినప్పటికీ, ఆమె ఆ రూమర్‌లను ఖండించారు. ఇప్పటికే ఈ చిత్రంలో హీరోయిన్‌గా త్రిప్తి దిమ్రి ఎంపికయ్యారు. తాజాగా అందిన సమాచారం ప్రకారం, 'స్పిరిట్'లో ఒక శక్తివంతమైన పాత్ర కోసం దర్శకుడు సందీప్ రెడ్డి వంగా బాలీవుడ్ నటి కాజోల్‌ను సంప్రదించినట్లు తెలుస్తోంది. కాజోల్‌కి కూడా స్క్రిప్ట్ బాగా నచ్చిందని ఆమె ఈ ప్రాజెక్ట్‌లో భాగమవడానికి పాజిటివ్‌గా స్పందించినట్లు ఇండస్ట్రీ వర్గాలు చెబుతున్నాయి. ఈ వార్త నిజమైతే, 'స్పిరిట్' కాజోల్‌కు మొదటి తెలుగు సినిమా కానుంది. ఆమె ఇంతకుముందు కొన్ని తమిళ చిత్రాలలో నటించినప్పటికీ, తెలుగులో ఇప్పటివరకు నటించలేదు. కాజోల్ లాంటి నటి 'స్పిరిట్' టీంలో చేరితే, ఈ పాన్-ఇండియా ప్రాజెక్ట్‌కు మరింత బలం, క్రేజ్ వస్తుందని సినీ విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు. ప్రస్తుతం ఈ వార్తపై అధికారిక ప్రకటన వెలువడాల్సి ఉంది.

## దుమ్మురేపుతున్న ..పేరుగల్ల పెద్దిరెడ్డి ఫోక్ సాంగ్

తెలంగాణ జానపద గాయని, నృత్యకారిణి నాగదుర్గ నుంచి తాజాగా విడుదలైన పాట 'పేరుగల్ల పెద్దిరెడ్డి' ప్రస్తుతం యూట్యూబ్‌లో మరియు సోషల్ మీడియాలో దుమ్మురేపుతోంది. తెలంగాణ ఫోక్ సాంగ్స్‌తో తనకంటూ ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్న నాగదుర్గ, ఈ కొత్త పాటతో మరోసారి ప్రేక్షకులను ఆకర్షిస్తున్నారు. పేరుగల్ల పెద్దిరెడ్డి అంటూ వచ్చిన ఈ పాట తండ్రి మీద ప్రేమతో కూతురు చెబుతున్న నేపథ్యంలో ఉంది. పల్లెటూరి వాతావరణాన్ని, జానపద లయను ప్రతిబింబిస్తూ ఈ పాట ఆకట్టుకుంటుంది. ఎప్పటిలాగే, నాగదుర్గ ఈ పాటలో తనదైన శైలిలో చేసిన ఎనర్జిటిక్ డ్యాన్స్ ప్రేక్షకులను ఎంతగానో ఆకట్టుకుంటోంది. శుక్రవారం విడుదలైన ఈ పాట కొద్ది గంటల్లోనే యూట్యూబ్‌లో మిలియన్ల వ్యూస్‌ను సాధిస్తూ ట్రెండింగ్‌లో నిలిచింది. పల్లె జానపద పాటల అభిమానుల మధ్య ఈ పాట క్రేజీ హిట్‌గా మారడంతో నాగదుర్గ ఖాతాలో మరో విజయవంతమైన జానపద పాట చేరింది. ఈ పాటకు బుల్లెట్ బండి లక్ష్మణ్ సాహిత్యం అందించగా.. మమత రమేష్ పాడింది. మదన్ కే సంగీతం అందించాడు.




HEAD OFFICE FLAT NO 101 2ND FLOOR SADGURU APTS BEHIND BAZAR THARANKA SEC BAD 500017,
HYDERABAD TELANGANA STATE OFFICE
PHONE NAMBER 9603437744, 7729045143,9441015254,7893948284 EMAIL : JAIBHEEMTVINDIA@GMAIL. COM, WEBSITE: WWW.JAIBHEEM,TV.COM